



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక :154 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : తిరుపతి | మంగళవారం 16 జూన్ 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :154 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : TIRUPATI | TUE 16 JUNE 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur




## టెక్నాలజీ, ఎయిర్ కనెక్టివిటీ.. సింగపూర్ పర్యటనలో చంద్రబాబు కీలక భేటీలు

- సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- విదేశీ వ్యవహారాల మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తోనూ కీలక సమావేశం
- అమరావతి సహా అర్బన్ గవర్నెన్స్‌లో సహకారం కోరిన ముఖ్యమంత్రి
- ఏపీ నుంచి ఆక్వా, ఉద్యాన ఉత్పత్తుల దిగుమతికి విజ్ఞప్తి
- సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, ఎయిర్ కనెక్టివిటీపై ఫలవంతమైన చర్చలు


- మిగతా 2లో




## సతీసమేతంగా రుద్రాభిషేకంలో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్...

- రాష్ట్ర శ్రేయస్సు కోసం లోకేశ్, బ్రాహ్మణి దంపతుల రుద్రాభిషేకం
- హైదరాబాద్ నివాసంలో మంత్రి లోకేశ్ దంపతుల ప్రత్యేక పూజలు
- ఏపీ ప్రజల సంక్షేమం కోరుతూ మహాశివుడికి లోకేశ్ పూజలు
- లోకేశ్, బ్రాహ్మణి ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం

- మిగతా 2లో



## గొడ్డలి పార్టీతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి



పెన్ పవర్ డెస్క్: గొడ్డలి పార్టీతో నిరంతరం అప్రమత్తంగా ఉండా లని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. వైకాపా నిత్యం కుట్రలు, కుతంత్రాలతో రాజకీయం చేస్తోందంటూ సీఎం చంద్రబాబు నిరంతం చెబుతున్న మాట నూటికి నూరు శాతం నిజమని చెప్పారు. మెగా డీఎస్సీ నిర్వహణపై గొడ్డలి పార్టీ చేస్తున్న ఆరోపణలు, దుష్ప్రచారంతో ఆ విషయం మరోసారి స్పష్టమవుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళు పూర్తయిన సందర్భంగా కర్నూలులో నిర్వహించిన విజయోత్సవ సభలో మంత్రి మాట్లాడారు. "వైకాపా నేతలు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు

- మిగతా 2లో




## తెలంగాణ అమరవీరుల గుర్తింపులో జాప్యం..

### ఢిల్లీలో పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు

- తెలంగాణ అమరవీరుల గుర్తింపులో జాప్యమెందుకని ప్రశ్న
- రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచిందన్న పవన్ కల్యాణ్
- తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల కోసం జనసేన పనిచేస్తుందన్న పవన్

- మిగతా 2లో




## 16 ఏళ్ల లోపు వారికి 'నో సోషల్ మీడియా'

### బ్రిటన్ ప్రభుత్వం సంచలన నిర్ణయం...

- 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాపై నిషేధం విధించిన యూకే
- పిల్లల మానసిక ఆరోగ్యం, భద్రతే లక్ష్యమన్న ప్రధాని కీర్ స్టార్మర్
- టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్ సహా ప్రధాన ప్లాట్‌ఫామ్‌లకు వర్తించనున్న నిబంధనలు
- నిర్ణయాన్ని స్వాగతించిన స్వచ్ఛంద సంస్థలు

పెన్ పవర్ డెస్క్:బ్రిటన్‌లో 16 ఏళ్లలోపు చిన్నారులు సోషల్ మీడియాను ఉపయోగించకుండా నిషేధించాలని అక్కడి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆన్‌లైన్ ప్రపంచంలో పిల్లల మానసిక ఆరోగ్యాన్ని, భద్రతను కాపాడటంతో పాటు వారికి ఆరోగ్యకరమైన బాల్యాన్ని అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు ప్రధాని కీర్ స్టార్మర్ సోమవారం

- మిగతా 2లో

## కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై దాడి...

- 'కాక్‌రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై జైపూర్‌లో దాడి
- నీట్ లీక్, నిరుద్యోగంపై నిరసన తెలుపుతుండగా ఘటన
- కేంద్ర మంత్రి రాజీనామా డిమాండ్‌తో ఆందోళన
- అభిజీత్‌పై మూకదాడికి సంబంధించిన వీడియోలు వైరల్
- యువతలో ఈ పార్టీకి ఆన్‌లైన్‌లో భారీ మద్దతు

- మిగతా 2లో




## అమెరికా-ఇరాన్ డీల్.. స్వాగతించిన మోదీ



పెన్ పవర్ డెస్క్:అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందంపై భారత ప్రధాని నరేంద్రమోదీ స్పందించారు. ఉద్రిక్తతలను ముగించేం దుకు ఇరుదేశాలు ఓ అంగీకారానికి రావడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో మోదీ పోస్ట్ చేశారు. "పశ్చిమాసియాలో

- మిగతా 2లో

## బడుల్లో బ్రేక్‌ఫాస్ట్



- 1,269 పాఠశాలల్లో ఉచిత అల్పాహార పథకం స్టార్ట్
- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు టిఫిన్ తినిపించిన స్టూడెంట్
- రాష్ట్రవ్యాప్తంగా స్కూళ్లు రీఓపెన్
- పూలు, చాక్లెట్లు ఇచ్చి స్వాగతం పలికిన టీచర్లు
- బ్రేక్ ఫాస్ట్ స్కీంతో 1.44 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి

- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## హ్యాట్రిక్ పై యోగి గురి

భారత రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఉత్తరప్రదేశ్ లో ఎన్నికల వేడి అప్పుడే మొదలైంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రాత్మక హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ రికొత్త వ్యూహాలకు పదును పెడుతోంది. గతంలో లాగా కాకుండా, ఈసారి ఎన్నికలకు ముందే యోగి ఆదిత్యనాథ్ తామే సీఎం అభ్యర్థిగా బరిలోకి దిగుతారని పార్టీ జాతీయ నాయకత్వం అధికారికంగా ప్రకటించడం గమనార్హం. గత లోక్‌సభ ఎన్నికల్లో సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ సాధించిన విజయాలకు బ్రేక్ వేయడమే కాకుండా, విపక్షాల ఓటు బ్యాంకును ముక్కలు చేసేందుకు యోగి మార్క్ పొలిటికల్ స్కెచ్ సిద్ధమైంది. అఖిలేష్ యాదవ్ విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చిన ౹ాణూ పిచ్డే, దళిత్, అల్పసంఖ్యాక్ - వెనుకబడిన, దళిత, మైనారిటీల కూటమి ఫార్ములాను దెబ్బతీయడమే యోగి ప్రధాన ఎజెండా. దీనికోసం ఇటీవల యూపీ క్యాబినెట్‌ను విస్తరిస్తూ ఆరుగురు కొత్త మంత్రులతో యోగి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ విస్తరణ వెనుక పక్కా సోషల్ ఇంజనీరింగ్ దాగి ఉంది. సమాజ్ వాదీ పార్టీ బలంగా నమ్ముకునే యాదవేతర ఓబీసీ , దళిత సామాజిక వర్గాలకు మంత్రివర్గంలో పెద్దపీట వేయడం ద్వారా అఖిలేష్ యాదవ్ ఓటు బ్యాంకు పునాదులను కదిలించేలా యోగి వ్యూహాత్మక అడుగులు వేశారు. ఎస్పీ సాంప్రదాయ ఓటు బ్యాంకు అయిన యాదవేతర వెనుకబడిన కులాలను తమ వైపు తిప్పుకోవడం ద్వారా అఖిలేష్ ౹ాణూ ముసుగును తొలగించాలని యోగి ప్లాన్ చేస్తున్నారు. సమాజ్ వాదీ పార్టీలో యాదవుల ఆధిపత్యంపై అసంతృప్తిగా ఉన్న ఇతర ఓబీసీ ఉప-కులాలను మౌర్య, కుర్మీ, నిషాద్, రాజ్‌భర్ వంటి వర్గాలను బీజేపీ తన వైపు తిప్పుకుంటోంది. ఇందుకోసం చిన్న చిన్న ప్రాంతీయ పార్టీలతో పొత్తులను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా ఆయా సామాజిక వర్గాల చివరి లబ్ధిదారుడికి చేరేలా యోగి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కుల సమీకరణాలతో పాటు రాష్ట్రాన్ని కుదిపేసే క్రైమ్, గ్యాంగ్‌స్టర్ సంస్కృతిని ఉక్కుపాదంతో అణచివేయడం ద్వారా శాంతిభద్రతల అంశాన్ని మరోసారి తన ప్రధాన ఆయుధంగా మలుచుకుంటున్నారు. ఇక రాజకీయంగా విపక్షాలను డిఫెన్స్‌లో పడేసేందుకు యోగి ఆదిత్యనాథ్ మరోసారి తన పాత వైభవమైన 'హార్డ్ హిందుత్వ' అస్త్రాన్ని ప్రయోగించారు. ఇటీవల కుషీనగర్, గొండాలలో జరిగిన బహిరంగ సభల్లో ఆయన నేరుగా సమాజ్ వాదీ పార్టీని రామ విరోధులు గా అభివర్ణించారు. కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలు దశాబ్దాల పాటు అయోధ్య రామమందిర నిర్మాణాన్ని అడ్డుకున్నాయని, 500 ఏళ్ల హిందువుల నిరీక్షణకు డబుల్ ఇంజన్ సర్కార్ మాత్రమే ముగింపు పలికిందని గుర్తు చేశారు. అఖిలేష్ యాదవ్ ఇటీవల అవలంబిస్తున్న సాఫ్ట్ హిందుత్వ పాలిటిక్స్‌ను యోగి తీవ్రంగా ఎండగడుతున్నారు. అభివృద్ధి జాతీయ భద్రత అనే అంశాలను కూడా యోగి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నారు. ఒకప్పుడు అల్లర్లకు, మాఫియాకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న ఉత్తరప్రదేశ్‌లో ఇప్పుడు బ్రహ్మోస్ మిసైల్ తయారీ కేంద్రాలు వస్తున్నాయని, పాకిస్తాన్‌ను సైతం గడగడలాడించే రక్షణ పరిశ్రమలు యూపీ గడ్డపై ఏర్పాటవుతున్నాయని ఆయన చెప్పుకొస్తున్నారు. నవ్య అయోధ్య, కాశీ విశ్వనాథ్ కారిడార్ ద్వారా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించామని, గతంలో జరిగిన పరీక్షల పేపర్ లీకేజీల నిందితులను జైలుకు పంపామని వివరిస్తున్నారు. అఖిలేష్ యాదవ్ కులాల వారీగా ఓట్లను ఏకం చేసే ప్రయత్నం చేస్తుంటే.. యోగి ఆదిత్యనాథ్ మాత్రం ఆ ఓట్లను చీలుస్తూ హిందూ ఓటు బ్యాంకును ఏకం చేస్తూనే, యాదవేతర వెనుకబడిన వర్గాలను అధికారంలో భాగస్వాములను చేసే ద్వంద్వ వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. గడిచిన రెండు ఎన్నికల కంటే కూడా 2027 లో యూపీ అసెంబ్లీలో భారీ మెజార్టీతో బీజేపీ తిరిగి పీఠాన్ని దక్కించుకుంటుందని యోగి ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రూరమైన పొలిటికల్ మైండ్ గేమ్‌లో అఖిలేష్ యాదవ్ యోగి స్పీడ్‌ను ఎంతవరకు తట్టుకుంటారనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

## సతీసమేతంగా రుద్రాభిషేకంలో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఆయన అర్ధాంగి నారా బ్రహ్మణి దంపతులు సోమవారం హైదరాబాద్‌లోని తమ నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ వారు మహాశివుడికి ఈ పూజలు చేశారు. పవిత్రమైన సోమవారం సందర్భంగా, వేద పండితుల మార్గదర్శకత్వంలో ఏకాదశ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రగతి, శ్రేయస్సు, ప్రజా సంక్షేమం కోసం పరమశివుడి ఆశీస్సులు కోరుతూ ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు. రుద్రాభిషేకం అనంతరం లోకేశ్, బ్రాహ్మణి దంపతులు ప్రత్యేక హారతి కార్యక్రమంలో పాల్గొని, వేద పండితుల నుంచి ఆశీర్వచనం స్వీకరించారు. రాష్ట్ర ప్రజల మేలు కోరుతూ మంత్రి దంపతులు ఈ పూజలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీనిపై మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. రుద్రాభిషేకం ఫొటోలను పంచుకున్నారు.

## గొడ్డలి పార్టీతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

- **మొదటి పేజి తరువాయి**

మేలు చేయలేదు.. డీఎస్సీలు నిర్వహించలేదు. అధికారం కోల్పోయాక మాత్రం కుట్రల మీద కుట్రలు పన్నుతున్నారు. మెగా డీఎస్సీ-2025ను అడ్డుకునేందుకు, ఆ ప్రక్రియను పురిట్లోనే చంపేయడానికి ఎన్నో కేసులు వేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్.. ఓ వైపు ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తూ, మరోవైపు పెట్టుబడులు, ఉద్యోగావకాశాలను సృష్టించేలా పరిశ్రమలు తెస్తున్నారు. దీన్ని ఓర్వలేక గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తూ తప్పుడు ప్రచారం చేయిస్తోంది. అత్యంత పారదర్శకంగా జరిగిన మెగా డీఎస్సీపై ఏడాది తర్వాత ఆరోపణలు గుప్పిస్తూ ఆ పార్టీ సైకోయిజాన్ని ప్రదర్శిస్తోంది. వైకాపా పాలనతో వెంటిలేటర్‌పైకి వెళ్లిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సీఎం చంద్రబాబు బాగు చేసి ఐసీయూకి తీసుకొచ్చారు. నాడు జగన్ అమ్మఒడి ఒక్క బిడ్డకే ఇస్తే.. ఎంత మంది బిడ్డలుంటే అందరికీ తల్లికి వందనం అందిస్తున్నాం" అని నిమ్మల రామానాయుడు అన్నారు.

**సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి సమీక్ష**

అంతకుముందు కర్నూలు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి నిమ్మల సమీక్ష నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. మొదటి ఏడాదిలోనే హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేశామని చెప్పారు. నేటికీ రిజర్వాయర్లు, చెరువులు నిండుకుండల్లా ఉన్నాయంటే చంద్రబాబు వాటర్ మేనేజ్‌మెంట్ వల్లే సాధ్యమైందన్నారు. కర్నూలు పశ్చిమ ప్రాంతం సాగు, తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చంద్రబాబు, లోకేశ్ సూచించారని చెప్పారు. కీలకమైన గుండ్రేవుల, ఆర్డీఎస్ కుడి కాలువ, గాజుల దిన్నె, వేదవతి, గురురాఘవేంద్ర ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని రామానాయుడు తెలిపారు.

## 16 ఏళ్ల లోపు వారికి 'నో సోషల్ మీడియా'

- **మొదటి పేజి తరువాయి**

ప్రకటించారు. డౌనింగ్ స్ట్రీట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రధాని కీర్ స్టార్మర్ మాట్లాడుతూ, "మన పిల్లలను విఫలం చేస్తున్న వ్యవస్థకు స్వస్తి పలికే సమయం ఆసన్నమైంది. ఈ నిర్ణయం ద్వారా పిల్లలకు వారి బాల్యాన్ని తిరిగి అందిస్తున్నాం" అని పేర్కొన్నారు. టెక్ దిగ్గజాల ప్రభావం నుంచి చిన్నారులను రక్షిస్తూ, వారి సురక్షితమైన వాతావరణంలో ఎదిగేందుకు ఈ నిషేధం దోహదపడుతుందని ఆయన వివరించారు.

ఇప్పటికే ఆస్ట్రేలియాలో అమలవుతున్న విధానం స్ఫూర్తితో ఈ నూతన పాలసీని తీసుకువస్తున్నారు. దీని ప్రకారం టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్, స్నాప్‌చాట్, ఎక్స్ వంటి ప్రధాన ప్లాట్‌ఫామ్‌లపై 16 ఏళ్లలోపు వారికి ప్రవేశం ఉండదు. లైవ్ స్ట్రీమింగ్, అపరిచితులతో సంభాషించడం వంటి ఫీచర్లపై కూడా ఆంక్షలు అమలవుతాయి. ఈ నిర్ణయానికి ముందు ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో దాదాపు 90 శాతం మంది తల్లిదండ్రులు ఈ నిషేధానికి మద్దతు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని పలువురు స్వాగతిస్తున్నారు. చిన్నారుల రక్షణలో ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని ఎన్ఎస్‌పీసీసీ వంటి స్వచ్ఛంద సంస్థలు పేర్కొన్నాయి. ఆన్‌లైన్ కంటెంట్ కారణంగా తన కుమార్తెను కోల్పోయిన ఎస్తర్ ఘే అనే తల్లి, ఈ నిషేధం ఎందరో పిల్లల ప్రాణాలను కాపాడగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఈ చట్టం అమలు తీరుపై నిపుణులు కొన్ని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఆస్ట్రేలియాలో ఇటువంటి నిషేధం ఉన్నప్పటికీ, చాలామంది టీనేజర్లు వీపీఎన్ వంటి మార్గాల ద్వారా సోషల్ మీడియాను వినియోగిస్తున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ సవాళ్లను అంగీకరించిన ప్రధాని స్టార్మర్, సాంకేతిక అడ్డంకులను సాకుగా చూపి చర్యలు తీసుకోకుండా ఉండలేమని స్పష్టం చేశారు. కఠినమైన వయసు ధ్రువీకరణ వ్యవస్థలతో జులై నుంచి ఈ చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# బాదం పప్పు బాగోతాలు - ఎపిసోడ్ 19

# ఒక ఎస్సై బదిలీల వెనుక అసలు కథ ఏమిటి?

- వి.ఆర్‌ల నుంచి పోస్టింగ్‌ల దాకా...
- ఎక్కడికి వెళ్లినా అదే వివాదాలా..?
- పోస్టింగ్‌లు, వి.ఆర్‌లు, మామజీ ప్రభావంపై శాఖలోనే గుసగుసలు
- తొలి పోస్టింగ్ నుంచే వివాదాల వెంటాడటం
- పాలకొల్లు నుంచి పెనుమంట్ర వరకు వి.ఆర్‌ల పరంపర
- మామ జీ అండతోనే కీలక పోస్టింగ్‌లా?
- తణుకు, కొవ్వూరు, పాలకొల్లు టౌన్‌ల్లోనూ అదే కథ?
- రైడ్లలో స్వాధీనం చేసుకున్న వస్తువులపై ఆరోపణలు
- రాజకీయ ఆశ్రయం - శాఖలో చర్చనీయాంశం

**పోలీసు శాఖలో బదిలీలు, పోస్టింగ్‌లు, వి.ఆర్. (వేకెంట్ రిజర్వ్)లు సాధారణ పరిపాలనా ప్రక్రియలే. అయితే ఒక అధికారి పేరు వరుసగా ప్రతి పోస్టింగ్‌లో వివాదాలకు కేంద్రంగా మారి, అనంతరం వి.ఆర్‌కు వెళ్లి, కొంతకాలానికే మరో కీలక పోస్టింగ్‌లో ప్రత్యక్షమవుతుండటం ఇప్పుడు శాఖలోనే చర్చనీయాంశంగా మారింది. శాఖ వర్గాల్లో "బాదం పప్పు"గా పిలుచుకునే ఓ ఎస్సై కెరీర్ ప్రయాణం ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లా పోలీసు వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.**

ఎడిటర్ , పెన్ పవర్ తాడేపల్లి గూడెం జూన్ 15 : కాళ్ళ మొదటి పోస్టింగ్ వచ్చింది అక్కడ నుంచి రెండవ పోస్టింగ్ పాలకొల్లు రూరల్ ఎస్సై గా ట్రాన్స్ఫర్ అయ్యారు మన బాదం పప్పు.. అయితే అక్కడ కొన్ని లొసుగులు దొరకడం తో పాలకొల్లు రూరల్ నుంచి విఆర్ లోకి వెళ్ళాడు. విఆర్ లోకి వెళ్ళిన మూడు నెలలకే, మూడూ నాళ్ళ ముచ్చటగా ఎక్కడ పోయిందో అక్కడే వెతుక్కోమన్నట్టుగా మళ్లీ పాలకొల్లు రూరల్ కు పోస్టింగ్ తెచ్చుకున్నాడు.. జనరల్ ట్రాన్స్ఫర్ లో అక్కడ నుంచి తాడేపల్లిగూడెం రూరల్ కు ట్రాన్స్ఫర్ అయ్యాడు మళ్లీ జనరల్ ట్రాన్స్ఫర్ లో పెనుమంట్ర ట్రాన్స్ఫర్ అయ్యాడు.

అక్కడ కూడా రుచి మరిగిన కోడి మిద్దెక్కి కూసిందని.. కుక్క తోక వంకర లా మళ్లీ పెనుమంట్ర లో దొరికి వి ఆర్ లోకి వెళ్ళాడు. అనంతరం అర్ధబలం ఉపయోగించి తణుకు ట్రాఫిక్ ఎస్సై గా చేసి తణుకు రూరల్ ఎస్సై గా ట్రాన్స్ఫర్ అయ్యాడు అక్కడ మళ్లీ కథ మొదటికి వచ్చి తణుకు రూరల్ నుంచి విఆర్ లోకి వెళ్లాడూ.. మమ జీ చక్కగా ప్లాన్ ఎగ్జిక్యూట్ చేసి విఆర్ నుంచి మళ్లీ కొవ్వూరు ఎస్సై గా బదిలీ చేయించుకున్నాడు.. అబ్బే అక్కడ కూడా అదే పాట .. కొవ్వూరు నుంచి కూడా వి ఆర్ కి వెళ్ళాడు .. అనతరం వి ఆర్ నుంచి మళ్లీ మామ జీ దయతో వెస్ట్ గోదావరి స్పెషల్ బ్రాంచ్ ఎస్సైగా వెళ్లాడు... ఇ సారి అంగబలం అర్ధ బలం ఉపయోగించి మామ జీ పాలకొల్లు టౌన్ కు ఎస్సై గా పోస్టింగ్ వేయించాడు కథ మళ్లీ మామూలే సేమ్ టూ సేమ్ యదావిధిగా పాలకొల్లు టౌన్ నుంచి వి ఆర్ లో కి వెళ్ళాడు .. అక్కడ నుంచి ఈ సారి శాఖ లో ఓ పెద్ద తలకాయ కు పెద్ద మొత్తం లో దక్షిణం మామజీ సమర్పించాడని శాఖలోని తోటి ఉద్యోగులే గుసగుసలాడుకోవడం కొసమెరుపు..? ఎట్టకేలకు మొత్తానికి తాడేపల్లిగూడెం టౌన్ కు పోస్టింగ్ రప్పించుకున్నాడని ఇప్పుడు కూడా వి ఆర్ కు వెళ్ళినా .. మళ్లీ పోస్టింగ్ ఎలా వేయించుకోవాలో మామ జీ కు తెలిసినంతగా మారెవరికి తెలియదని విశ్వసనీయ సమాచారం ...? పేకాట, కోడిపందెలు, గంజాయి మాఫియా లాంటి రైడ్ లు జరిగి నిందుతులను పట్టుకున్నప్పుడు నగదు, బంగారం కొంత సైడ్ చేస్తారని, శాఖలో తోటి ఉద్యోగులే బహిరంగంగా మాట్లాడుకోవడం..? ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

కొసమెరుపు ఏంటంటే ఏ స్టేషన్ కి వెళ్ళిన కోడిపందాలు ఆడుతున్న సమయంలో కోడిపందాలు ఆడిన వారిని పట్టుకుని ఆ పట్టుకున్న సమయంలో మేలు రకం జాతి కోడి పుంజులను సైడ్ చేసి ...? తన తండ్రిని పంపించి అక్కడ నుంచి ఆ మేలురకం కోడిపుంజులను లక్షల్లో అమ్మించి వ్యాపారం చేసాడని విశ్వసనీయ సమాచారం...? సాదా సీదా కుటుంభం నుంచి వచ్చిన బాదం పప్పు కు ఈ ఉద్యోగం కూడా జ్యోతుల నెహ్రూ దయ తోనే వచ్చిందని విశ్వాసనీయ సమాచారం.... అందుకే ఎప్పుడు తన ఇంటికి కాకినాడ జిల్లా గండేపల్లి మండలం వెళ్ళిన జగ్గంపేట నియోజకవర్గం లో ఉన్న రాజకీయ నాయకుడు జ్యోతుల నెహ్రూ ను కలిసి వస్తాడని సమాచారం ... ఈ అన్నీ అంశాలపై ఉన్నతాధికారులు స్పందిస్తారా...! అధికారిక విచారణ జరుపుతారా..? లేదా అన్నది వేచి చూడాల్సిందే ....

**ఎపిసోడ్ -20**

**సాహసం చేయరా డింబకా .. ఆ అవినీతి ప్రోపర్టీల కథల చిట్టా.. ప్రాణం సత్తిపండు వద్ద ఉందిలే ..?**

# బడుల్లో బ్రేక్‌ఫాస్ట్

వేసవి సెలవుల అనంతరం తెలంగాణ వ్యాప్తంగా సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. కొత్త విద్యా సంవత్సరం తొలి రోజు నుంచే రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అల్పాహార పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలోని 1,269 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలు చేస్తుండగా, దీని ద్వారా సుమారు 1.44 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ పథకం కింద విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మిగిలిన మూడు రోజులు రాగి మాల్ట్ అందిస్తారు. ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులందరికీ ఈ అల్పాహారం వర్తిస్తుంది. ఇప్పటికే అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా విస్తరించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడం, హాజరు శాతం పెంచడం, డ్రాపౌట్లను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో ఈ పథకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. చాలా రోజుల తర్వాత పాఠశాలలు తెరుచుకోవడంతో విద్యార్థుల సందడి నెలకొంది. కొత్త దుస్తులు, బ్యాగులతో విద్యార్థులు ఉత్సాహంగా బడిబాట పట్టారు. విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. "పాఠశాల కేవలం పాఠాలు నేర్పే ప్రదేశం కాదు. మన వ్యక్తిత్వాన్ని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే దేవాలయం. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని నేను గట్టిగా నమ్ముతున్నాను. అందుకే విద్యా రంగాన్ని అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు అనేక సంస్కరణలు చేపట్టాం" అని సీఎం తన సందేశంలో పేర్కొన్నారు. "అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి పౌష్టికాహారం అందించడమే కాకుండా, విద్యార్థుల భవిష్యత్తు కోసం అనేక చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులు ఉత్సాహంగా చదువుకోవాలి. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో జ్ఞానాన్ని సంపాదించి, మీ కలలను సాకారం చేసుకోవాలి. విద్య అనేది ఎవరూ దొంగిలించలేని గొప్ప సంపద" అని విద్యార్థులకు సూచించారు.

# తెలంగాణ అమరవీరుల గుర్తింపులో జాప్యం..

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 12 ఏళ్లు గడుస్తున్నా, ఉద్యమ అమరవీరులను సముచితంగా గుర్తించి గౌరవించడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

తెలంగాణ ఉద్యమంలో సుమారు 1,200 మంది ప్రాణత్యాగం చేశారని, వారి బలిదానాలు తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. "ప్రజలు ప్రాణత్యాగాలు చేసేంత గొప్ప నేల అది. అందుకే నాకు ఆ నేల పట్ల, అక్కడి ప్రజల పట్ల ఎంతో గౌరవం ఉంది. ఒక లక్ష్యం కోసం ఇంతమంది ఆత్మబలిదానాలు చేసుకుంటారా అనిపించింది" అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో అమరవీరులకు నివాళులర్పించేందుకు తాను వెళ్లాలని

భావించగా, ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని ఈ సందర్భంగా ఆరోపించారు.

యువతను బలిచేసి కొందరు నాయకులు తెలంగాణలో అధికార పీఠాన్ని అధిరోహించారని ఆయన విమర్శించారు. తెలంగాణ ఉద్యమ అసలు ఆకాంక్షల సాధన కోసం జనసేన నిరంతరం శ్రమిస్తుందని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ఉండి భవిష్యత్తు ప్రయోజనాల కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై దాడి...

యువతలో ఆన్‌లైన్‌లో సంచలనంగా మారిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై దాడి జరిగింది. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో సోమవారం ఓ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయనపై కొందరు వ్యక్తులు మూకుమ్మడిగా దాడి చేశారు. ఒక్కసారిగా చెంపపై కొట్టడంతో దీప్కే ఆత్మరక్షణ కోసం ప్రయత్నించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర కలకలం రేగింది. నీట్ పేపర్ లీక్, దేశంలో నిరుద్యోగం, విద్యా వ్యవస్థలోని లోపాలపై సీజేపీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జైపూర్‌లోని షహీద్ స్మారక్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమం జరుగుతుండగానే అభిజీత్ దీప్కేపై ఈ దాడి జరిగింది. ఆందోళన చేస్తున్న అభిజీత్‌ను ఓ గుంపు అడ్డుకుని దాడికి పాల్పడింది. దాంతో, అభిజీత్ పై దాడికి పాల్పడిన వారిని పట్టుకుని కాక్రోచ్ జనతా పార్టీ కార్యకర్తలు చితకబాదారు.

కొందరు యువతను 'బొద్దింకలు' అంటూ సీజేఐ చేసిన ఓ వివాదాస్పద వ్యాఖ్యకు వ్యంగ్యాస్త్రంగా, అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీలో చదువుతున్న 30 ఏళ్ల అభిజీత్ దీప్కే మే నెలలో 'కాక్రోచ్ జనతా పార్టీ'ని ప్రారంభించారు. అనతికాలంలోనే ఈ ఉద్యమం యువతను ఆకట్టుకుని ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. గతంలో ఢిల్లీ, పుణె నగరాల్లో నిరసనలు చేపట్టిన ఈ బృందం, జైపూర్‌లోనూ ఆందోళనకు పిలుపునిచ్చింది. అయితే, క్షేత్రస్థాయిలో నిరసన తెలుపుతుండగా ఆయనపై దాడి జరగడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

## అమెరికా-ఇరాన్ డీల్.. స్వాగతించిన మోదీ

- **మొదటి పేజి తరువాయి**

ఉద్రిక్తతల వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడింది. ఎన్నో దేశాల్లో ప్రాణనష్టం వాటిల్లింది. ఈ యుద్ధాన్ని ముగించేలా అమెరికా, ఇరాన్ అంగీకారం కుదుర్చుకోవడం స్వాగతించే విషయం. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వాలను పునరుద్ధరించడం, స్వేచ్ఛా నౌకాయానం, వాణిజ్యానికి భరోసా కల్పించడంలో ఈ పరిణామం సాయపడుతుందని భారత్ విశ్వసిస్తోంది. సుస్థిరమైన తుది ఒప్పందానికి దారితీసేలా.. మిగిలిన అంశాల పైనా సానుకూల చర్చలు జరుగుతాయని విశ్వసిస్తున్నాం" అని మోదీ రాసుకొచ్చారు.

పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించేలా ఇరాన్‌తో ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీన్ని టెహ్రాన్ కూడా ధ్రువీకరించింది. దీనిపై స్విట్జర్లాండ్ వేదికగా జూన్ 19న ఇరుదేశాలు సంతకాలు చేయనున్నాయి. హార్మూజ్‌లో అమెరికా నౌకాదళ దిగ్బంధాన్ని తొలగించడం, ఈ జలసంధిని పూర్తిగా తెరవడం, ఇరాన్ చమురుపై ఆంక్షలు తదితర అంశాలపై ఇరుదేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలిసింది.

## టెక్నాలజీ, ఎయిర్ కనెక్టివిటీ.. సింగపూర్ పర్యటనలో చంద్రబాబు కీలక భేటీలు

సింగపూర్ లో పర్యటిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు, సోమవారం అక్కడ కీలక సమావేశాల్లో పాల్గొన్నారు. తన రెండు రోజుల పర్యటనలో భాగంగా ఇవాళ, సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో భేటీ అనంతరం ఆ దేశ విదేశీ వ్యవహారాల మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్-సింగపూర్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్య బలోపేతంపై ఇరువురు నేతలు ప్రధానంగా చర్చించారు. ముఖ్యంగా ఏపీలోని విమానాశ్రయాల నుంచి సింగపూర్‌కు, అలాగే ఇతర ప్రాంతాలకు విమాన సర్వీసులు, ఎయిర్ కనెక్టివిటీని పెంచే అవకాశాలపై ఫలవంతమైన చర్చలు జరిపారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అందిస్తున్న అవకాశాలను సింగపూర్ విదేశాంగ మంత్రికి వివరించారు. అమరావతి రాజధాని నిర్మాణ ప్రణాళికలను, దాని భవిష్యత్ దార్శనికతను ఆయనకు తెలియజేశారు. తయారీ రంగంతో పాటు సేవల రంగంలోనూ ఆంధ్రప్రదేశ్ వేగంగా అగ్రగామి రాష్ట్రంగా ఎదుగుతోందని తెలిపారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూమి లభ్యతతో పాటు, సేవల రంగంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఏపీలో పుష్కలంగా ఉన్నాయని వివరించారు. రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ తీరప్రాంతం, పోర్టుల ద్వారా సరకు రవాణాకు ఉన్న అనుకూలతలను ప్రస్తావించారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ హైడ్రోజన్ తయారీలో ఏపీ దేశంలోనే కీలక పాత్ర పోషించనుందని స్పష్టం చేశారు. విశాఖలో డేటా సెంటర్ ఎకోసిస్టమ్ ఏర్పాటు, ప్రపంచంతో ఏపీని అనుసంధానించే సబ్-సీ కేబుల్ ప్రాజెక్టుల గురించి తెలిపారు. అమరావతిని 'క్వాంటం వ్యాలీ'గా తీర్చిదిద్దుతున్నామని, ఉత్తరాంధ్రలో ప్రపంచ దిగ్గజ ఉక్కు సంస్థ ఆర్సెలార్ మిట్టల్ భారీ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశానికి ముందు, ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్‌తో ఆయన అధికారిక నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. దాదాపు 30 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాల మధ్య సహకారానికి సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించారు. అమరావతి సహా రాష్ట్రంలోని ఇతర నగరాలు, పట్టణాల్లో అర్బన్ గవర్నెన్స్‌లో సింగపూర్ నైపుణ్యాన్ని, సహకారాన్ని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. టెక్నాలజీ, సెమీకండక్టర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి అధునాతన రంగాలతో పాటు యూనివర్సిటీల్లో పరిశోధనలకు తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా సెమీ కండక్టర్ల తయారీకి అవసరమైన ఎకోసిస్టమ్, కెపాసిటీ బిల్డింగ్‌లో సహకరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి సేద్యం ద్వారా పండిస్తున్న పంటల గురించి సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో పండిస్తున్న ఉద్యాన, ఆక్వా ఉత్పత్తులను సింగపూర్ దిగుమతి చేసుకునే అంశాన్ని పరిశీలించాలని కోరారు. ఈ ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. పోర్టులు, ఎయిర్‌పోర్టుల అభివృద్ధి ద్వారా రెండు ప్రాంతాలు కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ చర్చల సందర్భంగా సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్, అమరావతి రాజధాని నిర్మాణం గురించి ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. రాజధానిలో ఏర్పాటు చేయనున్న అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు, మౌలిక సదుపాయాల గురించి ఆసక్తి కనబరిచారు. దీనికి చంద్రబాబు బదులిస్తూ, ప్రపంచంలోనే అత్యంత నివాసయోగ్యమైన నగరాల్లో ఒకటిగా అమరావతి నిలవనుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ సమావేశాల్లో సీఎం వెంట రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, సింగపూర్‌లో భారత హై కమిషనర్ శిల్పక్ అంబులే తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా। తిరుపతి జిల్లా। చిత్తూరు జిల్లా। వై.ఎస్.ఆర్. కడప జిల్లా ।

# ప్రజలతో మాటమంత్రి కార్యక్రమాన్ని నిర్వహించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి




బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జూన్ 15. బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని పెనుబల్లి, చెల్లాయ పాలెం గ్రామాలలోని ప్రజలతో మాటామంతి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించిందని తెలిపారు. మహిళలు రాజకీయాల్లో రావడానికి అవకాశాలు కల్పిస్తే కొంతమంది నాయకులు వ్యక్తిగతంగా విమర్శిస్తున్నారని ఆరోపించారు. ఈ విధంగా ఆరోపిస్తే మహిళ సాధికారత ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. హోం మంత్రిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాలలో అభివృద్ధి పనులు చేసుకుంటున్నామని అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పెనుబల్లి గ్రామంలో 80 లక్షల రూపాయలతో రోడ్లు, వాటర్ ట్యాంకులు, డ్రైనేజీలు నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. చెల్లాయి పాలెం గ్రామ రోడ్డుకు ఒకటిన్నర కోట్ల రూపాయలు మంజూరు చేసామని త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. గత ప్రభుత్వంలో గ్రామాల్లో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. రాష్ట్రంలో సంక్షేమం,అభివృద్ధి అందిస్తున్నామన్నారు.

# కావలి టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ప్రజా దర్బార్ నిర్వహణ

- నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు, వినతిపత్రాల స్వీకరణ
- ప్రతి అర్జీని పరిశీలించి బాధితుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే
- కొన్ని సమస్యలపై అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి తక్షణ పరిష్కారానికి ఆదేశాలు
- ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని అభినందిస్తున్న ప్రజలు




నెల్లూరు పెన్ పవర్,జూన్ 15 ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటికి సత్వర పరిష్కారం చూపాలనే లక్ష్యంతో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి సోమవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కావలి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, పట్టణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు. ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడిన ఎమ్మెల్యే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు రెవెన్యూ, పింఛన్లు, గృహాలు, తాగునీటి సరఫరా, రహదారులు, విద్యుత్, ఆరోగ్యం, సంక్షేమ పథకాల అమలు వంటి పలు అంశాలపై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల తీవ్రతను బట్టి కొన్ని అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో ఎమ్మెల్యే నేరుగా ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సేవలు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్యలను వేగంగా పరిష్కరించడం ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా ప్రతినిధిగా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటం తన బాధ్యత అని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. ప్రజల కష్టాలు తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ప్రజా దర్బార్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం వల్ల త్వరితగతిన పరిష్కార మార్గాలు కనుగొనే అవకాశం

ఉంటుందని అన్నారు.ఎమ్మెల్యే నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రతిరోజూ ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే సేవలను పలువురు ప్రజలు అభినందించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి ప్రజలు తమ పూర్తి మద్దతు, ఆశీర్వాదాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే చూపుతున్న చొరవ నియోజకవర్గ ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచుతోందని అభిప్రాయపడ్డారు.

# మిన్నంటిన మంత్రి నారాయణ జన్మదిన వేడుకలు.

**నగరవ్యాప్తంగా కూటమి శ్రేణుల సంబరాలు**

**వినూత్నంగా మంత్రి నారాయణ బర్త్డే.**

**డ్రోన్‌తో పాలాభిషేకం, 69 కేజీల భారీ కేక్ కటింగ్.**

**ఆలయంలో అల్లుడు రవితేజ ప్రత్యేక పూజలు.**

**డివిజన్లలో మంత్రి సతీమణి రమాదేవి సేవా కార్యక్రమాలు**



నెల్లూరు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మాత్యులు డాక్టర్ పొంగూరు నారాయణ 69 వ జన్మదిన వేడుకలు నెల్లూరు సిటీ నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల సంబరాల మధ్య అత్యంత ఘనంగా జరిగాయి. చింతారెడ్డిపాలెంలోని నారాయణ మెడికల్ కాలేజ్ ప్రాంగణంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీశ్రీశ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంత్రి అల్లుడు గంటా రవితేజ, కుటుంబ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 101 టెంకాయలు కొట్టి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆ తర్వాత జిల్లా టీడీపీ కార్యాలయంలో పార్టీ నేతలు బాలాజీ, జమీర్, తిరుమల నాయుడు ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలను వినూత్నంగా నిర్వహించారు.మంత్రి నారాయణ చిత్రపటానికి డ్రోన్ ద్వారా పాలాభిషేకం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.వేడుకలకు ముఖ్య అతిదులుగా వచ్చిన మంత్రి సతీమణి పొంగూరు రమాదేవి,అల్లుడు గంటా రవితేజ పార్టీ ముఖ్య నేతలు,కుటుంబ సభ్యులతో కలిసి నాయకులు ఏర్పాటు చేసిన 69 కేజీల భారీ కేక్‌ను కట్ చేశారు. నగరవ్యాప్తంగా భారీగా బాణాసంచా కాలుస్తూ కూటమి కార్యకర్తలు మిన్నంటేలా సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, మేయర్ సుజాతా అశోక్,రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్,నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు తదితర నేతలు పాల్గొని మంత్రి సేవాగుణాన్ని కొనియాడారు. కేవలం నెల్లూరులోనే కాకుండా అమెరికా, లండన్, జర్మనీ,సింగపూర్‌లలో సైతం మంత్రి జన్మదిన వేడుకలను అభిమానులు నిర్వహించారు.అనంతరం మంత్రి సతీమణి పొంగూరు రమాదేవి నగరంలోని పలు డివిజన్లలో విస్తృతంగా పర్యటించారు.44వ డివిజన్ టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ అశోక్ ఆధ్వర్యంలో జరిగిన సేవా కార్యక్రమాల్లో, 45వ డివిజన్ విజయమహల్ గేట్ వద్ద పోకల రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో, 46వ డివిజన్ జనసేన నేత గునుకుల కిషోర్ ఆధ్వర్యంలో ట్రంక్ రోడ్డులోని న్యూ పెట్రోల్ బంక్ వద్ద జరిగిన కేక్ కటింగ్, సేవా కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కటింగ్ చేశారు.రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు ఆధ్వర్యంలో కాన్సర్ హాస్పిటల్ లో నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 15 వ డివిజన్ లో పెంచల్ చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన మంత్రి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. 54 వ డివిజన్ జనార్దన్ రెడ్డి కాలనీలో నారాయణ నేత్రజ్యోతి,దంతసురక్ష మెడికల్ క్యాంపు వద్ద జహీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొన్నారు. 52 వ డివిజన్ రంగనాయకుల పేట లో ఇక్బాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు.లీలా మహల్ సెంటర్, మూలాపేట సెంటర్,పెద్దబజారు సెంటర్ లలో స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు..ఈ సందర్భంగా పొంగూరు రమాదేవి మాట్లాడుతూ మంత్రి నారాయణ ప్రస్తుతం సింగపూర్ పర్యటనలో ఉన్నప్పటికీ,ఆయన జన్మదిన సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రతి డివిజన్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించటం చాలా సంతోషంగా ఉందన్నారు. నారాయణ సార్ ఎల్లప్పుడూ ప్రజాసేవకే మొదటి ప్రాధాన్యత ఇచ్చే జనం మనిషి అని, అత్యధిక మెజారిటీ ఇచ్చిన సిటీ వాసుల రుణం తీర్చుకునేందుకు నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కార్యకర్తల సంక్షేమం కోసం ఏడాదికి 10 కోట్లు వెచ్చిస్తూ సిటీ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారని వివరించారు.మంత్రి అల్లుడు గంటా రవితేజ మాట్లాడుతూ అభివృద్ధే అజెండాగా ముందుకు సాగుతున్న మంత్రి నారాయణ తన సేవాతత్పరతతో పేదల హృదయాల్లో పదిలమైన స్థానం సంపాదించుకున్నారని, సిటీ వాసులకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని స్పష్టం చేశారు.

# కూటమి ప్రభుత్వ వరం పేదవారికి సొంతిల్లు టిడిపి నేత ఆకుల కుబేరు మణి



నాయుడుపేట, పెన్ పవర్, జూన్ 15 కూటమి ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదవాని సొంతింటి కల నెరవేరుస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి టిడ్కో గృహ సముదాయాల్లో సొంతిల్లు నిర్మించి ఇవ్వడం పేదవారికి ఒక వరం అని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆకుల కుబేరుమణి అన్నారు. నాయుడుపేట పట్టణ సమీపంలోని బిరదవాడ వద్ద టిట్కో గృహ సముదాయాల్లో జరిగిన గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం,పట్టణ టిడిపి అధ్యక్షులు షేక్ రఫీ ఆధ్వర్యంలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న టిట్కో గృహ సముదాయంలో తన వద్ద పనిచేస్తున్న ముగ్గురు వ్యక్తులకు ఇళ్లు మంజూరు కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ కి సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.అనంతరం గృహ ప్రవేశం మూడు కుటుంబాల వారికి బహుమతులు అందజేశారు. ఆయన వెంట విన్నమాల పెద్దకాపు శ్రీనివాసులు రెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు.

# ప్రజా వైద్యుడు డాక్టర్ ప్రభాకర్ నాయుడు 89వ జన్మదిన వేడుకలులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి




కావలి పెన్ పవర్,జూన్ 15పలనాడు జ్యోతి ప్రజా వైద్యుడు, మానవతావాది డాక్టర్ ప్రభాకర్ నాయుడు 89వ జన్మదిన వేడుకలు సోమవారం కావలి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి హాజరై కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ ప్రభాకర్ నాయుడిని శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్ నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ప్రజలకు చేరువగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని కొనియాడారు. కావలి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొంటున్నారని అన్నారు. ఎమ్మెల్యే ప్రజల కోసం అంకితభావంతో పనిచేస్తుండటం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.అనంతరం ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ ప్రభాకర్ నాయుడు జన్మదిన వేడుకల్లో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. వైద్యుడిగా మాత్రమే కాకుండా మానవతావాదిగా, సేవామూర్తిగా ఆయన సమాజానికి అందించిన సేవలు అమూల్యమైనవని కొనియాడారు. పేదలకు అండగా నిలుస్తూ, ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడంలో ఎప్పుడూ ముందుండే గొప్ప వ్యక్తిత్వం డాక్టర్ ప్రభాకర్ నాయుడిదని అన్నారు.ఎక్కడో జన్మించి, ఎక్కడో పెరిగినా కావలి పట్టణాన్ని తన సొంత ఊరిలా భావించి దశాబ్దాలుగా ప్రజలకు సేవ చేస్తున్న మహోన్నత వ్యక్తి ప్రభాకర్ నాయుడు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ ప్రేమించే ఆయన వ్యక్తిత్వం అందరికీ ఆదర్శమని అన్నారు. సమాజానికి సేవ చేయాలనే తపన, ప్రజల పట్ల ప్రేమ, మానవీయ విలువలు ఆయనను ప్రత్యేక వ్యక్తిగా నిలబెట్టాయని చెప్పారు.డాక్టర్ ప్రభాకర్ నాయుడు ప్రేమ, ఆప్యాయత వెలకట్టలేనివని,

ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే తెలిపారు. వైద్య రంగంలోనే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. కావలి పట్టణ ప్రజలు ఆయన సేవలను ఎప్పటికీ గుర్తుంచుకుంటారని, ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజలకు మార్గదర్శకంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, వైద్యులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, పట్టణ ప్రజలు పాల్గొని డాక్టర్ ప్రభాకర్ నాయుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# గిరిజనుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం: ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి




కావలి పెన్ పవర్,జూన్ 15 శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం కావలి లో గిరిజనుల ఆర్థికాభివృద్ధి కోసం ఎస్టీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు, వారి సంప్రదాయ వృత్తులకు అవసరమైన పరికరాలు, ఉపాధి అవకాశాలను పెంచే వాహనాలు అందించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మొగిలి కల్లయ్య కోరారు. సోమవారం కావలి ఎమ్మెల్యే కార్యాలయంలోనిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో బోగోలు మండలం పాత బిట్రగుంట గ్రామానికి చెందిన గిరిజనులతో కలిసి ఆయన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజనులు తమ ఉపాధి, జీవనోపాధికి సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు అందితే తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని వివరించారు. గిరిజనులకు ప్రత్యేకంగా సబ్సిడీ రుణాలు మంజూరు చేయడంతో పాటు వారి వృత్తులకు అవసరమైన పరికరాలు, వాహనాలు అందించాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి గిరిజనుల సమస్యలనుశ్రద్ధగా విన్నారు. ఈ అంశాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అర్హులైన గిరిజనులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గిరిజనులసంక్షేమం,అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని,వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# డిఎస్సార్ పాఠశాలలో వెల్లువెత్తిన విద్యార్థుల అభిమానం.

## ఘనంగా విద్యాదాత మంత్రి నారాయణ జన్మదిన సంబరాలు థాంక్యూ నారాయణ సార్ అంటూ చిన్నారుల కృతజ్ఞతాభివందనం. విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసిన మంత్రి సతీమణి రమాదేవి, అల్లుడు గంటా రవితేజ.





నెల్లూరు పెన్ పవర్,జూన్ 15 రాష్ట్ర పురపాలక , పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ జన్మదిన వేడుకలు మూలాపేటలోని డీఎస్సార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అత్యంత వైభవంగా, పండుగ వాతావరణంలో జరిగాయి. విద్యాదాతపై విద్యార్థినుల్లో అభిమానం వెల్లువెత్తింది. పాఠశాలను కార్పొరేట్ స్థాయిని మించి అద్భుతంగా తీర్చిదిద్దిన మంత్రి కి చిన్నారులంతా ఏకకంఠంతో థాంక్యూ నారాయణ సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు,ఉపాధ్యాయులు నిర్వహించిన జన్మదిన వేడుకల్లో మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి, అల్లుడు గంటా రవితేజ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కేక్ కట్ చేసి మంత్రి నారాయణకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి పొంగూరు రమాదేవి, గంటా రవితేజ సహపంక్తి భోజనం చేశారు. నెల్లూరు నగర మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్‌లు స్వయంగా విద్యార్థులకు, అతిథులకు భోజనాలను వడ్డించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం మంత్రి సతీమణి పొంగూరు రమాదేవి మాట్లాడుతూ డీఎస్సార్ స్కూల్ రూపురేఖలు పూర్తిగా మారిపోవడంతో పిల్లల్లో కనిపిస్తున్న ఉత్సాహం చూస్తుంటే ముచ్చటేస్తోందన్నారు. పేద పిల్లలకు చదువును మించిన ఆస్తి మరొకటి లేదని, దానినే వారికి బహుమతిగా ఇవ్వాలని నారాయణ సార్ దృఢంగా సంకల్పించారన్నారు. వీఆర్సి పాఠశాల తరహాలోనే నగరంలోని అన్ని ప్రభుత్వ హైస్కూళ్లను అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధం చేస్తున్నారని. కార్పొరేట్ సంస్థలను మించిన నాణ్యమైన విద్యను పేద పిల్లలకు ఉచితంగా అందేలా చర్యలుతీసుకుంటున్నారన్నారు. పేదలకు ఏ కష్టం వచ్చినా నేనున్నానని భరోసా ఇచ్చేందుకు నారాయణ సార్ ఎప్పుడూ ముందుంటారు అని పేర్కొన్నారు. మంత్రి నారాయణ అల్లుడు గంటా రవితేజ మాట్లాడుతూ విద్యార్థుల మధ్య నారాయణ సార్ పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నెల్లూరుతో పాటు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు,పూర్వ విద్యార్థులు ఇతర దేశాల్లోనూ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు.. నారాయణ అంటే అభివృద్ధి– అభివృద్ధి అంటే నారాయణ అనేలా ఆయన పేరు సంపాదించుకున్నారని తెలిపారు.. అలాంటి నిరంతర శ్రామికుడు, ఉన్నత వ్యక్తిత్వం ఉన్న నాయకుడు రాజకీయాల్లో ఉండటం మన అందరి అదృష్టం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ,స్థానిక టీడీపీ నేతలుఅన్నంగి ప్రసాద్,గండవరం నాని,గోగుల నాగరాజు,అల్లంపాటి జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

# బాపట్ల డీఎస్పీ సిహెచ్ చంద్రమౌళిని మర్యాదపూర్వకంగా కలసిన మాజీ సైనికులు





బాపట్ల :( పెన్ పవర్) జూన్ 15 బాపట్ల పట్టణం లోని డి ఎస్ పి కార్యాలయంలో ఈరోజు బాపట్ల డీఎస్పీ సిహెచ్ చంద్రమౌళిని మాజీ సైనికుల తో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాంద్ర సాంబశివరావు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు తాంద్ర సాంబశివరావు మాట్లాడుతూ, బాపట్ల డివిజన్ లో విపత్కర పరిస్థితులు సంభవించి, పోలీసు వారికి అవసరం ఉన్నప్పుడు మాజీ సైనికులు సంపూర్ణ సహకారం అందించటానికి సిద్ధంగా ఉంటాము అని డీఎస్పీ చంద్రమౌళికి తెలియ జేశారు. అదేవిదంగా బాపట్ల డివిజన్ లో మాజీ సైనికులకు మరియు మాజీ సైనికుల కుటుంబ సభ్యులకు సంబంధించిన సమస్యలపై పోలీసు వారు త్వరితగతిన మరియు సానుకూలంగా ను పరిష్కరించే విదంగా చూడాలి అని కోరిన వెంటనే, ఖచ్చితంగా దేశ సేవ చేసి వచ్చిన మాజీ సైనికులకు అన్యాయం జరిగింది అని పోలీసు వారి దృష్టికీ వచ్చినవి వెంటనే న్యాయం జరిగే విదంగా చర్యలు తీసుకుంటాము అని హామీ ఇచ్చిన డీఎస్పీ చంద్రమౌళికి ధన్యవాదాలు తెలియ జేసిన రాష్ట్ర అధ్యక్షులు తాంద్ర సాంబశివరావు. కార్యక్రమంలో బాపట్ల అసోసియేషన్, ఉపాధ్యక్షులు చలికొండ వెంకట కృష్ణారావు, జనరల్ సెక్రెటరీ షేక్ మొయినుద్దీన్, ట్రెజరర్ పి యల్లమంద, బాపట్ల జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షులు బాలా శివా రెడ్డి, స్టేట్ కమిటీ గౌరవ సలహాదారులు సుంకర శేషగిరి రావు, సీనియర్ మాజీ సైనికులు తోట దుర్గారావు, కొండలరావు, రాయపూడి శ్రీనివాసరావు, పసుపులేటి ప్రసాద్,అడే కిషోర్ మొదలగు వారు పాల్గొన్నారు.

# నా జాతి ప్రజల బాగు కోసం 22 ఏళ్ల న్యాయవాద వృత్తిని త్యాగం చేశాను

## మాజీ న్యాయమూర్తి జడా శ్రావణ్ కుమార్







బాపట్ల:(పెన్ పవర్) జూన్ 15 బాపట్ల దళిత క్రైస్తవుల హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ అంశాలపై నిర్వహించిన దళిత క్రైస్తవ సమర శంఖారావం సభలో మాజీ న్యాయమూర్తి జడా శ్రావణ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నా జాతి ప్రజల అభ్యున్నతి కోసం 22 ఏళ్ల న్యాయవాద వృత్తిని త్యాగం చేశాను. సమాజానికి సేవ చేయడమే నా లక్ష్యం" అని అన్నారు. అలాగే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రాముఖ్యతను సభలో విపులంగా వివరించారు. ప్రతి పౌరుడికి మత స్వేచ్ఛ కల్పించే ఈ అధికరణం యొక్క విశిష్టత, దాని ద్వారా లభించే హక్కులు మరియు రాజ్యాంగ పరిరక్షణలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సభకు బాపట్ల జిల్లా వ్యాప్తంగా వందలాది మంది పాస్టర్లు, దళిత క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, విశ్వాసులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సమాజ హక్కుల సాధన, రాజ్యాంగ పరిరక్షణ, సంఘటిత పోరాటం అవసరంపై సభలో పలువురు నాయకులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

# మాజీ మంత్రి ,శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ని మర్యాదపూర్వకంగా కలిసిన ఈ ఆర్ ఓ బి.లీలారాణి





చిలకలూరిపేట , పెన్ పవర్, జూన్ 15 : చిలకలూరిపే: ట నియోజకవర్గ ఈ ఆర్ ఓ గా బాధ్యతలు స్వీకరించిన లీలారాణి సోమవారం మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావును వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కు ఆమె పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఓటర్ల నమోదు ప్రక్రియ తదితర అంశాలపై వారు చర్చించారు. వీరితో పాటు ఆర్ ఐ రమీజా తదితర అధికారులు ఉన్నారు.

# పబ్లిసిటీ కోసమే పవన్ కళ్యాణ్ , సామినేని ఉదయభాను పై అనుచిత వ్యాఖ్యలు : జనసేన నాయకులు.




పెన్ పవర్,జూన్ 15 జగ్గయ్యపేట పట్టణం.మరియు నియోజకవర్గం 15/6/26 జగ్గయ్యపేట పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జనసేన నాయకులు మాట్లాడుతూ,ఇటీవల ఓ సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత ఇంటూరి రాజగోపాల్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ మరియు ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ సామినేని ఉదయభాను పై చేసిన అసభ్యకర, వ్యక్తిగత వ్యాఖ్యలను జగ్గయ్యపేట జనసేన నాయకులు తీవ్రంగా ఖండించారు.బి రాజకీయంగా ప్రజల మద్దతు కోల్పోయిన కొందరు నాయకులు కేవలం పబ్లిసిటీ కోసం వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని వారు విమర్శించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన నాయకులు వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలతో రాజకీయ సంస్కృతిని దిగజార్చడం బాధాకరమన్నారు. ఇంటూరి రాజగోపాల్ చేసిన వ్యాఖ్యలు జనసేన పార్టీ కార్యకర్తలు, అభిమానుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని పేర్కొన్నారు. రాజకీయాల్లో విభేదాలు సహజమే అయినప్పటికీ, వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలం ఉపయోగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను జనసేన పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని, ఇంటూరి రాజగోపాల్ క్షమాపణలు చెప్పాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా వ్యక్తిగత విమర్శలకు దిగడం వైసీపీ నాయకుల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని జనసేన నాయకులు వీర మహిళలు అన్నారు

# ఢిల్లీ వేదికగా నిర్వహించిన సేన ప్రస్థానం జాతీయ సమైక్యత కోసం కార్యక్రమంలో పాల్గొన్న సామినేని ఉదయభాను






పెన్ పవర్,జూన్ 15 జగ్గయ్యపేట నియోజకవర్గం 25/6/26 జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన "సేన ప్రస్థానం -- జాతీయ సమైక్యత కోసం" కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను రాష్ట్ర జనసేన పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. దేశ సమగ్రత, జాతీయ ఐక్యత మరియు జనసేన పార్టీ భావజాల విస్తరణ లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశభక్తి, జాతీయ సమైక్యత అంశాలపై పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ చేసిన ప్రసంగాన్ని ఉదయభాను ఆసక్తిగా ఆలకించారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన జనసేన నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొని జాతీయ సమైక్యతకు జనసేన పార్టీ కట్టుబాటును చాటిచెప్పారు. ఈ సందర్భంగా సామినేని ఉదయభాను మాట్లాడుతూ, దేశ ప్రయోజనాలు మరియు జాతీయ సమగ్రతకు జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని, పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జనసేన భావజాలాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# పొడపాడు గ్రామంలో అత్యంత ఘనంగా కేకే పుట్టినరోజు వేడుకలు





పెదకూరపాడు పెన్ పవర్,జూన్ 15 పల్నాడు జిల్లా పెద్దకూరపాడు మండలం పొడపాడు గ్రామంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మరియు జనసేన పార్టీ రాష్ట్ర ప్రోగ్రామింగ్ చైర్మన్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శిష్యులు కల్యాణం శివ శ్రీనివాసరావు కేకే పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెదకూరపాడు మండలం పొడపాడు గ్రామంలో కేకే తమ్ముడు పొడపాడు శీను ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు రక్తదాన శిబిరాలు కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామమంతా మారుమూగేలా భారీ బాణాసంచాతో భారీ కేకుతో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు జనసేన నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ ఎత్తున పాల్గొన్నారు భారీ అన్నదానం నిర్వహించారు.

# సాగు భూమికి పట్టాలు ఇవ్వాలని ఎమ్మార్వో కార్యాలయం ముట్టడి

వేపాడు: పెన్ పవర్,జూన్ 15 సాగు భూమికి పట్టాలివ్వని ప్రభుత్వంపై రైతులు ఆందోళన బాట పట్టారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా వేపాడు మండలంలోని ఎమ్మార్వో కార్యాలయంను రైతులు ముట్టడించారు. ఈ క్రమంలో కొండగంగుపూడిలో ఉన్న అన్ని గ్రామాల నుంచి గిరిజన వెనకబడిన తరగతులకు చెందిన రైతాంగమంతా ఒక్కటై పోలీస్ స్టేషన్ నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్వో కార్యాలయం ఎదుట బయటయించిన రైతులు ఎమ్మార్వో లేకపోవడంతో ఆర్డీఓ వచ్చి సమాధానం చెప్పే వరకు ఆందోళన విరమించేది లేదని తేగేసి చెప్పేసారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష్యుడు జగన్ మాట్లాడుతూ . . రీ సర్వేలో కూడా పట్టా ఉన్న వారికే చేస్తున్నారని 30 ఏళ్లుగా సాగులో ఉన్న భూములకు రీ సర్వే చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సాగులో ఉన్న పేద రైతులకు పట్టా ఇవ్వకపోతే, ఈ రైతులను ప్రభుత్వం ఎలా ఆదుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రజా సమస్యలపై సత్వర స్పందన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, పెన్ పవర్, జూన్, 15, ప్రజల సమస్యలపై సత్వరం స్పందించి... వీలైనంత త్వరగా నాణ్యతతో పరిష్కరించడం జరుగుతోందని.. ఇదేవిధంగా ముందడుగు వేస్తూ ప్రతిఅధికారి అర్జీలపై ప్రత్యేక దృష్టిపెట్టి ప్రజలకు సంతృప్తికర సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు కలెక్టర్ లక్ష్మీశ... జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అధికారులతో కలిసి సోమవారం ప్రజా స్నేహపూర్వక పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 201 అర్జీలు రాగా వీటిలో రెవెన్యూకు సంబంధించి 56, పురపాలక శాఖకు సంబంధించి 31, పోలీస్ శాఖకు 29, పంచాయతీరాజ్ శాఖకు 17, డీఆర్డీఏకు 10 అర్జీలు వచ్చాయి. విద్యుత్‌కు 9, వైద్య ఆరోగ్యానికి 7, ప్రజారవాణాకు 6, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఐఈఎస్‌కు 5, కాలుష్య నియంత్రణకు 4, ఎండోమెంట్స్, గ్రామీణ నీటి సరఫరా శాఖలకు మూడు చొప్పున, పౌర సరఫరాలు, విభిన్న ప్రతిభావంతులు, విద్య, ఉపాధికల్పన, గృహ నిర్మాణం, కార్మిక, మైన్స్ అండ్ జియాలజీ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌కు రెండు చొప్పున అర్జీలు వచ్చాయి. బీసీ సంక్షేమం, సహకార, డ్వామా, మత్స్య, జాతీయ రహదారులు విభాగాలకు ఒకటి చొప్పున వచ్చాయి. ఈ అర్జీలపై ప్రత్యేకంగా దృష్టిసారించి నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సంతృప్తి స్థాయి బాగుండేలా అర్జీలను పరిష్కరించాలని.. ఈ విషయంలో జిల్లాస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజా వినతులపై స్పందన వేగవంతమైతేనే ప్రజలలో ప్రభుత్వంపై విశ్వాసం మరింత బలపడుతుందని పేర్కొన్నారు...

# ఓటర్ల జాబితా సవరణకు ప్రజలు సహకరించాలి: ఈఆర్ఓ బి. లీలారాణి



చిలకలూరిపేట , పెన్ పవర్, జూన్ 15 : చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ వేగంగా జరుగుతోందని నియోజకవర్గ ఎన్నికల అధికారి ఈఆర్ఓ బి. లీలారాణి తెలిపారు.నియోజకవర్గంలో మొత్తం 242 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటన్నింటికీ బూత్ లెవెల్ ఆఫీసర్లు , సూపర్వైజర్లను ఇప్పటికే నియమించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఇప్పటివరకు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 66% ఓటర్ల మ్యాపింగ్‌ను బీఎల్ఓలు విజయవంతంగా పూర్తి చేశారని ఈఆర్ఓ వెల్లడించారు. ఈ రోజు నుండి ప్రోగ్రాంలో భాగంగా ఎన్యుమరేటర్ల ద్వారా ఓటర్లందరికీ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు.

మూడు సార్లు ఇంటింటికీ బీఎల్ఓలు

ఓటర్ల వివరాల సేకరణ కోసం బీఎల్ఓలు ప్రతి ఇంటికీ మూడు సార్లు వస్తారని లీలారాణి తెలిపారు. మొదటిసారి ఫారాలు పంపిణీ చేయడానికి, రెండవసారి పూర్తి చేసిన ఫారాలను సేకరించడానికి వస్తారన్నారు. ఒకవేళ ఇళ్లకు తాళాలు వేసి ఉంటే, మూడవసారి కూడా వచ్చి వివరాలు సేకరిస్తారని, బీఎల్ఓలు ఇళ్లను సందర్శించకుండా ఏ ఒక్క ఓటును కూడా తొలగింపునకు ప్రతిపాదించరని ఆమె స్పష్టం చేశారు.

తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు

ఓట్ల తొలగింపుపై వస్తున్న తప్పుడు ప్రచారాలను, పుకార్లను ఓటర్లు ఎవరూ నమ్మవద్దని ఈఆర్ఓ విజ్ఞప్తి చేశారు. అర్హత ఉన్న ఏ ఒక్కరి ఓటును కూడా తొలగించడం జరగదన్నారు.వలస వెళ్లిన వారు, మరణించిన వారు లేదా వివాహమై ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలను సేకరించిన అనంతరం, ఒక నెల తర్వాత క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ స్వీకరిస్తామన్నారు.దీనిపై సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇచ్చి, ఈఆర్ఓ స్థాయిలో పూర్తి విచారణ జరిపిన తర్వాతే నిబంధనల ప్రకారం తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఆన్‌లైన్ ద్వారా సవరణలకు అవకాశం

ఓటర్ల జాబితాలో పేర్లు, తండ్రి పేరు, వయస్సు, ఇంటి నెంబర్ లేదా ఫోన్ నెంబర్లలో ఏవైనా తప్పులు ఉంటే ఎన్యుమరేషన్ ఫారాల ద్వారా బీఎల్ఓలకు సమర్పించవచ్చని తెలిపారు. వీటితో పాటు ప్రజలు స్వయంగా ఈసీఐ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా తమ వివరాలను ఉచితంగా సవరించుకోవచ్చని, డేటాను అప్‌డేట్ చేసుకోవచ్చని సూచించారు.ఓటర్లందరూ తమ వివరాలను సరిచూసుకుని, ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండేలా తమ ఇంటికి వచ్చే బీఎల్ఓలకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఈఆర్ఓ లీలారాణి కోరారు.

# పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెంచాలి

## డ్రాప్ అవుట్స్ అరికట్టాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.






బాపట్ల:( పెన్ పవర్) జూన్ 15 విద్యారంగంపై అనుబంధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులతో హైబ్రిడ్ మోడలో సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన సమావేశం నిర్వహించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన రోజు నుంచి పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెరగాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 1,123 ప్రభుత్వ పాఠశాలలో ఉండగా, అందులో 1,27,539 మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. కేవలం 69 వేల 567 మంది విద్యార్థులు మాత్రమే పాఠశాలలకు హాజరు కావడం ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థులంతా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రాప్ అవుట్స్ నివారించాలన్నారు. డ్రాప్ అవుట్స్ పై స్వర్ణ గ్రామ సచివాలయాల మహిళా పోలీసులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక పంపాలన్నారు. అలాగే ప్రతి ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలో నూరు శాతం హాజరు ఉండాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 4,493 మంది ఉపాధ్యాయులు వస్తుండగా 4,376 ఉపాధ్యాయులే హాజరుకావడం ఏమిటని నిలదీశారు. ఉపాధ్యాయుల హాజరు నూరు శాతం ఉండాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే విద్యార్థుల హాజరు నూరు శాతానికి చేరాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమాలు విధిగా నిర్వహించాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు యోగాంధ్ర కార్యక్రమానికి వేదికగా ఉండాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ సేవలు ప్రజలకు అందించే బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ చెప్పారు. సచివాలయాల సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని మార్గ నిర్దేశం చేశారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాలను ఆర్ డి ఓ లు, మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని ఆదేశించారు.

వాట్సాప్ గవర్నెన్స్ సేవలందించడంలో చీరాల మండలం తక్కువగా ఉండడంపై కలెక్టర్ ఆరా తీశారు. పనితీరులో వేగం పెంచాలని ఆయన సూచించారు. అక్షరాంధ్ర కార్యక్రమం కర్లపాలెం మండలంలో నేటికీ పెండింగ్ లో ఉండడంపై ఎంపీడీవోను ఆయన ప్రశ్నించారు. వయోజన విద్యపై అధికారులు దృష్టి సారించాలని పలు సూచనలు చేశారు. అక్షరాస్యత మరింత పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, ఉప కలెక్టర్ లవన్న, డీఈవో శ్రీనివాస్ సింగ్, సచివాలయాల కోఆర్డినేటర్ పి.యశ్వంత్, ఎండివోలు ఎంఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



భట్టిప్రోలు, పెన్ పవర్, (జూన్ 15) భట్టిప్రోలు మండలం ఐలవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు విద్యార్థిని విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.గ్రామానికి చెందిన ఆకురాతి శ్రీనివాసరావు కుమారుడు ఆకురాతి ఈశ్వర్ ప్రసాద్ ఉచితంగా నోట్ బుక్స్,పెన్నులు, పెన్సిళ్లు భట్టిప్రోలు మండల విద్యాశాఖ అధికారి యన్ దేవ రాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజే శారు.ఈ కార్యక్రమానికి హాజరైన మండల విద్యాశాఖ అధికారి మరియు దాతలు ఆకురాతి శ్రీనివాసరావు కుమారుడు ఆకురాతి ఈశ్వర్ ప్రసాద్ వారి భార్య సోదరుడు విద్యా కమిటీ చైర్మన్ ఎం రవీంద్ర సభ్యులు పులిమి డోలా శివకుమార్ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జే సురేష్, ఉపాధ్యాయులు టి రవికుమార్, అంగనవాడి టీచర్స్ మరియు కమిటీ సభ్యులు తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జలధారతో సిరులు ...చివరి భూముల్లో సాగు






బాపట్ల:( పెన్ పవర్ ) జూన్15 వర్షం నీటిని భద్రపరిచేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతుల్లో ఉత్సాహం నింపుతోంది. దశాబ్దాలుగా సాగునీరు లేక ఎండిన భూములన్ని సాగులోకి రానున్నాయి. బీడు భూముల్లో ఇప్పుడు సిరులు పండనున్నాయి. కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్న రైతుల ఆశలు నేడు నెరవేరుతున్నాయి. రానున్న వర్షాకాలం నాటికి కాల్వల ద్వారా చివరి భూములకు సాగునీరు అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. దీంతో భూగర్భ జలాలు మరింత పెరగనున్నాయి. అడుగంటిన భూగర్భ జల మట్టం పెరిగితే రైతులకు ఎంతో మేలు జరగనుంది. ఇప్పుడు రైతులంతా ఏకమై శ్రమదానం చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తక్షణమే అమలు చేసేలా వడివడిగా అడుగులు ముందుకు వేస్తోంది.

కాల్వల పునరుద్ధరణ

ప్రభుత్వం నిర్ణయంతో రైతుల ఆశలు చిగురించనున్నాయి. జలధార జలహారతి కార్యక్రమాలతో ఫీడర్ కాల్వలు పునర్జీవం పోసుకుంటున్నాయి. రేపల్లె మండలం తుమ్మల గ్రామం ఫీడర్ కాల్వ పునరుద్ధరణ పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉపాధి హామీ పథకం కింద ఆ పనులను చేపట్టడంతో గ్రామస్తులు ఆసక్తిగా ముందుకొచ్చారు. కాల్వలో చెత్తాచెదారం, చిల్ల చెట్లు తొలగించడం, మేటవేసిన మట్టి పూడికతీత పనులు చేపట్టారు. 25 మంది రైతులు ముందుకు వచ్చి శ్రమదానం చేస్తున్నారు. 1,500 మీటర్ల పొడవున, ఒక మీటర్ వెడల్పుతో ఒక మీటర్ లోతున కాల్వ తవ్వకాల పనులు మొదలయ్యాయి.

భూగర్భ జలం

కాల్వ పునరుద్ధరణ పనులతో అడుగంటిన భూగర్భ జలాలు పెరగనున్నాయి. వర్షాలు కురిస్తే ఆ కాల్వ పూర్తిగా నీటితో నిండేలా పనులు చేస్తున్నారు. అ ప్రాంతంలో కురిసిన వర్షం నీరంతా కాల్వలోకి చేరనుంది. తద్వారా భూగర్భ జలాలు క్రమేపి పెరగనున్నాయి. జలధార జలహారతి కార్యక్రమాలు రైతుల్లో ఉత్సాహం నింపుతోంది. తక్షణమే పనులు చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో రైతులంతా ఏకమై శ్రమదానం చేస్తున్నారు. వడివడిగా కాల్వ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి.

ప్రయోజనం బోలెడు


కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారిన భూములన్ని జలధార జలహారతి కార్యక్రమం ద్వారా ఇప్పుడు వినియోగంలోకి రానున్నాయి. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో అడుగంటిన భూగర్భ జలాలు మెరుగుపడనున్నాయి. కాల్వ శుభ్రం చేయడం ద్వారా చుట్టుపక్కల 30 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. కాల్వ దిగువ ప్రాంతాలలోని 25 ఎకరాలు సాగు లోకి వస్తాయి. నిలిచిపోయిన వ్యవసాయం ఇప్పుడు సాగులోకి రానుంది. పరోక్షంగా సమీపంలోని భూములలో ఉన్న బోర్ బావులన్ని రీఛార్జ్ కానున్నాయి. వ్యవసాయం లాభసాటిగా మారనుంది. ఆ ప్రాంతంలో భూములకు భవిష్యత్తులో నీటి కొరత తీరనుంది. పంట దిగుబడులు మరింత పెరగనున్నాయి. జలధార జలహారతి తో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

# పట్టువదలని పోలీస్ ఈ రవీంద్రుడు

## పొన్నాల కాలువ మహిళా హత్య కేసులో ఆచూకీ లభించని మహిళలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న కర్లపాలెం ఎస్. ఐ రవీంద్ర

## రాత్రి పగలు ఇదే కేసులో తలమునకలు

## కేసును క్షుణ్ణంగా పరిశీలిస్తున్న బాపట్ల రూరల్ బాపట్ల డిఎస్పి జిల్లా ఎస్పీ





బాపట్ల:( పెన్ పవర్) జూన్ 15 బాపట్ల జిల్లా కర్లపాలెంలోగత రెండు నెలల క్రితం కర్లపాలెం మండలం పొన్నాల కాలువలో గుర్తుతెలియని మహిళను అత్యంత కిరాతకంగా హత్య చేసి కాలువలో పడేశారు ఈ కేసు విచారణలో భాగంగా ఇప్పటివరకు కొందరు ఆచూకీ లభించని మహిళలను వారి తల్లిదండ్రులకు కర్లపాలెం ఎస్సై రవీంద్ర అప్పగించారు. బాపట్ల రూరల్ సీఐ హరికృష్ణ డిఎస్పి చంద్రమౌళి, జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాలతో, సాంకేతిక నిపుణుల సహకారంతో ఈ కేసును చాలా లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో భాగంగా అధికారికంగా ఇప్పటి వరకు ఇద్దరు మహిళలను, అనధికారికంగా మరో కొంతమంది మహిళలను వారి వారి తల్లిదండ్రులకు కుటుంబీకులకు అప్పగించారు.దీనిపై కర్లపాలెం ఎస్సై రవీంద్ర పై ప్రశంసల వర్షం కురుస్తుంది. ఇటీవల భట్టిప్రోలు మండలం ఐలవరం కి చెందిన మాచర్ల మారుతి అనే మహిళ గత రెండు సంవత్సరాల క్రితం భర్త కుటుంబీకులను వదిలి హైదరాబాద్ పారిపోయింది. అప్పుడు సదరు పోలీస్ స్టేషన్లో కేసు కూడా నమోదు కాలేదు. దీంతో మహిళ వివరాలు సేకరించిన ఎస్సై రవీంద్ర హైదరాబాదులో ఆమె ఉంటున్న నివాసానికి వెళ్లి ఆమెను కుటుంబీకులకు అప్పగించారు ఈ సందర్భంగా ఎస్సై రవీంద్ర మాట్లాడుతూ ఇంకా రాష్ట్ర పరిధిలో ఎక్కడైనా సరే మహిళల మిస్సింగ్ కేసులు ఉంటే వెంటనే కర్లపాలెం ఎస్సై 9440900870 నంబర్ కు సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# శ్రీశ్రీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళి



చిలకలూరిపేట , పెన్ పవర్, జూన్ 15 : చిలకలూరిపేట : గ్రంథాలయంలో సోమవారం జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ( గార్డ్స్) మరియు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో మహా కవి శ్రీశ్రీ వర్ధంతి కార్యక్రమం జరిగింది. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు తెల్ల సుబ్బారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీ విమర్శకులు డా.పీవీ సుబ్బారావు, జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి బొంత అజయ్ బాబు పాల్గొని మాట్లాడారు. అభ్యుదయ కవిత్వానికి ఆద్యుడు శ్రీశ్రీ అని కొనియాడారు. ఊహాలోకలో విహరించే భావకవిత్వాన్ని తరిమి ప్రజలకు ఉపయోగ పడే నవ్య కవిత్వాన్ని ఆవిష్కరించిన మహాకవి శ్రీశ్రీ అన్నారు.. శ్రీశ్రీ రాసిన మహాప్రస్థానం ఆధునిక కవిత్వంలో కలికితురాయి అని ప్రశంసించారు.. తొలుత శ్రీశ్రీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో గార్డ్స్ కార్యదర్శి పొనుగుబాటి బుల్లిబాబు, డా.చుక్క విన్సెంట్ పాల్ దార్ల బుజ్జిబాబు తదితరులున్నారు.

# ఓటు వేసి... పన్ను కట్టి....ప్రాణాలు మూటకట్టలా ?






బాపట్ల:( పెన్ పవర్ ) జూన్15 బాపట్ల మండల పరిధిలోని పిన్నిబోయినవారిపాలెం నుంచి నందిరాజు తోట మీదుగా హైవేకు వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి యముడు పిలుపుగా మారింది. ప్రాణాలు పోతేనే స్పందిస్తారా..?గ్రామ అభివృద్ధి మాటల్లోనే లేదా..? ప్రజల ప్రాణాలకు విలువ లేదా..? ఓట్లు కోసమేనా మా ఇళ్ళకు..?అనే ప్రశ్నలు ఇప్పుడు ఆ గ్రామ ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఫోటోల్లో కనిపిస్తున్న దృశ్యాలు చూస్తేనే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. రహదారి అంచులు అనేక చోట్ల కుంగిపోవడం, బిటుమెన్ పొర ఊడిపోవడం వల్ల వాహనదారులు నిత్యం ప్రమాద భయంతో ప్రయాణిస్తున్నారు. కాలువ పక్కనే రహదారి ఉండటంతో ఎప్పుడు ఏ వాహనం అదుపు తప్పి కాలువలో పడుతుందోనన్న భయంతో ప్రజలు ప్రయాణిస్తున్నారు. విద్యార్థులు, రైతులు, మహిళలు, వృద్ధులు ఇదే రహదారిపై ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది.పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి శాశ్వత చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే హామీలు,ఆ తర్వాత ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. "పన్నులు కడుతున్నాం... ఓట్లు వేస్తున్నాం... కానీ కనీసం సురక్షితంగా వెళ్లేందుకు ఒక రోడ్డు కూడా లేదా?" అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి రహదారిని పరిశీలించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. రహదారి అంచులను బలోపేతం చేసి, రోడ్డు పక్కన ఉన్న చెట్లు కట్ చేసి,ప్రమాదాలను నివారించే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# బాపట్లలో కన్నులపండువగా యోగాంధ్ర-2026' వేడుకలు




బాపట్ల:( పెన్ పవర్ ) జూన్15 ఇండోర్ క్రీడాప్రాంగణంలో యోగాసనాలు వేసిన వందలాది మంది సాధకులు, అధికారులు అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని బాపట్ల జిల్లా కేంద్రంలో యోగా ఉత్సవాలు మిన్నంటాయి. బాపట్ల జిల్లా వేదికగా బాపట్ల విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 6:30 గంటలకు అత్యంత వైభవంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వినూత్న కార్యక్రమానికి నియోజకవర్గ, జిల్లా స్థాయి అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, మహిళలు, వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు వందలాదిగా తరలివచ్చారు. దీంతో మున్సిపల్ ఇండోర్ క్రీడాప్రాంగణం అంతా యోగా సాధకులతో కిక్కిరిసిపోయింది. ఉదయాన్నే ప్రశాంత వాతావరణంలో అందరూ ఒకేలా క్రమశిక్షణతో యోగాసనాలు వేస్తూ అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో మారుతున్న ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిళ్ల కారణంగా మనుషులు అనేక రోగాల బారిన పడుతున్నారని, వీటన్నింటికీ యోగా ఒక్కటే సరైన పరిష్కారమని కొనియాడ

# అర్జీల పరిష్కారం పై అధికారులు సిద్ధ శుద్ధితో పని చేయాలి జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్





బాపట్ల:( పెన్ పవర్) జూన్ 15 ప్రజా సమస్యలపై అధికారులు చిత్తశుద్ధితో పరిచయాలని జిల్లా కలెక్టర్ తెలియజేశారు ఇంధన వనరుల సంరక్షణలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ వారు ఇచ్చిన మాట ప్రకారం సోమవారం కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమమునకు ఆయన ద్విచక్ర వాహనంపై హాజరైనారు.జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు వినతి పత్రాల ద్వారా తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. సావధానంగా విని వాటికి అక్కడికక్కడే ఆయన పరిష్కార మార్గం చూపారు. తన పరిధిలో లేని కొన్నిటిని పరిశీలన, మరికొన్నిటిని విచారణకు ఆదేశించారు. 167 అర్జీలు నమోదు కాగా, డివిజన్, మండల స్థాయి అధికారులతోనూ కలెక్టర్ వీక్షణ సమావేశం ద్వారా పీజీఆర్ఎస్ పై సమీక్షించారు.

యోగాంధ్ర కార్యక్రమాలు జిల్లా స్థాయి మరియు నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. కార్యక్రమాలకు హాజరయ్యే అధికారుల యొక్క హాజరు ఎక్సెల్ షీట్ లో ప్రతిరోజు వస్తుందని, కార్యక్రమాలకు హాజరు కాని మరియు ఈ ఆఫీస్ సరిగా నిర్వహించని అధికారులను వ్యక్తిగతంగా పిలిచి విచారణ చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. విచారణలో వారి వివరణ మేరకు చర్య లు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.


శాఖల యొక్క పనితీరు పై పర్యవేక్షణ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఓ పి టి ఎస్ పద్ధతిని తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. ఇందులో అధికారులు వారి శాఖకు సంబంధించిన అంశాలపై ఐ గాట్ యాప్ లో శిక్షణ పొందాలని ఆయన చెప్పారు. అధికారులకు నిర్దేశించిన విధులను నిర్వహించి వారి దినచర్యను నమోదు చేయాలన్నారు. ఈ ఫైలింగ్ ద్వారా వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. అధికారులు సిబ్బంది అందరూ ఎఫ్ ఆర్ ఎస్ లో హాజరు నమోదు చేయాలన్నారు. పై వాటికి సంబంధించి రాష్ట్రస్థాయిలో జిల్లాల వారీగా ర్యాంకింగ్ ఇవ్వడం జరుగుతుందని ఆయన చెప్పారు. రాష్ట్రస్థాయిలో బాపట్ల జిల్లా మూడవ స్థానంలో ఉండే విధంగా అధికారులందరూ శ్రద్ధతో పని చేయాలన్నారు.

సంక్షిప్త ఓటర్ల జాబితా ప్రత్యేక మ్యాపింగ్ డ్రైవ్ పై జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్యుమరేషన్ ఫారాలను అన్ని మండల తాసిల్దారులు మరియు విఆర్వోలు బిఎల్ఓ లాగిన్ లో అప్లోడ్ చేయాలన్నారు.

ఈ ఆఫీస్ వచ్చే ఫైళ్లను డిస్పోస్ చేయుటలో అలసత్వం వహిస్తున్న ముగ్గురు జిల్లా అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ జిల్లా రెవెన్యూ అధికారిని ఆదేశించారు. ఈ ఆఫీస్ లో వచ్చే ఫైళ్లను ఎప్పటికప్పుడు డిస్పోస్ చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖకు సంబంధించిన పశు సంపదతో గ్రామ సంపద పెంపు అనే పుస్తకమును జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ లవన్న తో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ఠ, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ లవన్న, వివిధ శాఖల జిల్లా అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు, పెన్ పవర్, జూన్, 15, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పనితీరు పై కాకుండా ఆమెను లక్ష్యంగా చేసుకుని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నానని గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఒక దళిత మహిళ ఆత్మవిశ్వాసంతో, హుందాగా, అందంగా కనిపిస్తే వైసీపీ నేతలకు ఎందుకు అసహనం కలుగుతోందని ప్రశ్నించారు. ఇవి కేవలం హోంమంత్రి అనితని మాత్రమే కాదు, తమకు నచ్చిన విధంగా హుందాగా జీవించే ప్రతి మహిళను అవమానించే వ్యాఖ్యలని అన్నారు. రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక మహిళల రూపురేఖలను లక్ష్యంగా చేసుకోవడం వైసీపీ సంస్కృతికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రభుత్వ పనితీరు లేదా హోంమంత్రి విధానాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఆధారాలతో విమర్శించాలని, వ్యక్తిత్వ హననానికి దిగడం రాజకీయ దివాళాకోరుతనమని పేర్కొన్నారు. మహిళలు తమకు నచ్చిన విధంగా తయారవడం వారి వ్యక్తిగత హక్కు అని, దానిని రాజకీయ విమర్శగా మార్చి మహిళలందరినీ అవమానించడం వైసీపీ వక్రబుద్ధికి నిదర్శనమని అన్నారు. మహిళలపై సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టిన ఘటనల్లో వైసీపీ నేతల ప్రమేయం ఉన్నా జగన్ స్పందించలేదన్నారు. మహిళా ప్రజాప్రతినిధులపై వ్యక్తిగత దూషణలు జరిగినా నైతిక బాధ్యత తీసుకోలేదని ఆరోపించారు. శాసనసభలో చంద్రబాబు నాయుడు కుటుంబ మహిళలపై జరిగిన వ్యాఖ్యలను రాష్ట్ర ప్రజలంతా ఖండించినా, అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్పందించలేదన్నారు. టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై మాజీ వైసీపీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను న్యాయస్థానం తప్పుబట్టినా వైసీపీ మౌనంగా వ్యవహరించిందని గుర్తుచేశారు. అమరావతి ప్రాంత మహిళలను కించపరిచేలా చేసిన వ్యాఖ్యల విషయంలో కూడా వైసీపీ వైఖరి మహిళా వ్యతిరేకంగానే ఉందన్నారు. ఇప్పుడు హోంమంత్రి అనిత మేకప్ పై వ్యాఖ్యలు చేయడం అదే ధోరణికి కొనసాగింపని పేర్కొన్నారు. మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు, వేధింపుల విషయంలో చట్టం ఎవరికీ చుట్టం కాదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చిన వెంటనే టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై పార్టీ కఠిన చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ కుటుంబ మహిళపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు చేసిన టీడీపీ కార్యకర్తను కూడా వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలపై వేధింపుల విషయంలో 'జీరో టాలరెన్స్' విధానాన్ని అమలు చేస్తోందని చెప్పారు. ఏ పార్టీకి చెందిన వారైనా మహిళలను కించపరిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలను గౌరవించని రాజకీయాలకు ఆంధ్రప్రదేశ్లో స్థానం లేదని, హోంమంత్రి వంగలపూడి అనిత పై చేసిన వ్యాఖ్యలకు గుడివాడ అమర్నాథ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి డిమాండ్ చేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని అవమానించే భాషను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ సహించరని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

# మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి: ప్రత్తిపాటి ఫౌండేషన్ కన్వీనర్ కంచర్ల శ్రీనివాసరావు



చిలకలూరిపేట , పెన్ పవర్, జూన్ 15 : చిలకలూరిపేట : నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో ప్రత్తిపాటి ఫౌండేషన్ నిర్వహిస్తున్న భారీ మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాటి ఫౌండేషన్ కన్వీనర్ కంచర్ల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రేపు అనగా జూన్ 16వ తేదీ మంగళవారం నియోజకవర్గ యువతకు ఉపాధి అవకాశాల దిశగా ఒక కీలకమైన రోజుగా నిలవనుందని తెలిపారు. ఒకప్పుడు రాష్ట్రవ్యాప్తంగా వినిపించిన "బాబు రావాలి -- జాబ్ కావాలి" అనే నినాదానికి నిదర్శనంగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉద్యోగాలు పొందాలని కోరారు. ఈ మెగా జాబ్ మేళాకు సుమారు 50 ప్రముఖ కంపెనీలు హాజరవుతున్నాయని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకు వేతనాలతో ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. టెన్త్ ఫెయిల్, టెన్త్ పాస్ నుంచి ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ తదితర వివిధ విద్యార్హతలు కలిగిన ప్రతి ఒక్కరికీ ఈ జాబ్ మేళా ఒక మంచి అవకాశమని కంచర్ల శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా వివిధ కంపెనీలు ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నాయని పేర్కొన్నారు. జూన్ 16వ తేదీ ఉదయం 8 గంటలకు అభ్యర్థులు ప్రత్తిపాటి గార్డెన్స్కు చేరుకుని తమ విద్యార్హతలకు సంబంధించిన అన్ని సర్టిఫికెట్లు, బయోడేటా మరియు ఇతర అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ అర్హతలకు అనుగుణంగా కంపెనీలను ఎంపిక చేసుకుని ఇంటర్వ్యూలలో పాల్గొనవచ్చని చెప్పారు. ఇంటర్వ్యూలలో ఎంపికైన అభ్యర్థులకు అదే రోజు సాయంత్రంలోపు అపాయింట్మెంట్ ఆర్డర్లు అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు. యువత ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని కంచర్ల శ్రీనివాసరావు ఆకాంక్షించారు.

# పారిశుద్ధ్యం, సుందరీకరణ పనులను పరిశీలించిన కమిషనర్.హాసిని





బాపట్ల:(పెన్ పవర్) జూన్ 15 బాపట్ల పురపాలక సంఘ పరిధిలో కమిషనర్ హాసిని ఉదయం పలు వార్డుల్లో పర్యటించి పారిశుధ్య, సుందరీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జీబీసీ రోడ్డు ప్రధాన రహదారి డివైడర్లను తనిఖీ చేసిన కమిషనర్ , మొక్కల మధ్య పెరిగిన కలుపు మొక్కల తొలగింపును పరిశీలించారు. రహదారి డివైడర్ల సుందరీకరణను మరింత మెరుగుపరుస్తూ మొక్కలను క్రమం తప్పకుండా సంరక్షించాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణా రెడ్డి కి సూచించారు. అనంతరం వివేకానంద కాలనీలోని మునిసిపల్ పార్కును సందర్శించి పార్కు నిర్వహణ, పరిశుభ్రత మరియు పరిరక్షణ చర్యలను సమీక్షించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే విధంగా పార్కును ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. తదుపరి భీమవారిపాలెం ప్రాంతంలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్ చెత్త సేకరణ, వీధుల పరిశుభ్రత తదితర పనులను ప్రతిరోజూ సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పట్టణంలో పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించేందుకు కృషి చేయాలని శానిటరీ ఇన్స్పెక్టర్ చేవూరి కరుణ ను ఆదేశించారు.

# మహిళా, శిశు, గిరిజన సంక్షేమంలో అపూర్వ ప్రగతి

అమరావతి పెన్ పవర్, జూన్ 15 రాష్ట్ర ప్రభుత్వం ఎన్నడూ లేని స్థాయిలో మహిళలు, చిన్నారులకు, గిరిజనులకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిందని మహిళా అభివృద్ధి, శిశు, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సంక్షేమాన్ని సాధికారతగా, అభివృద్ధిని సామాజిక న్యాయంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 56,746 అంగన్వాడీ కేంద్రాల ద్వారా దాదాపు20లక్షల మంది గర్భిణీలు, బాలింతలు,చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్య సేవలు, పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నామని తెలిపారు. అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేస్తూ 5,389 మంది టీచర్లు, 5,287 మంది ఆయాలను నియమించి 11 వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పించినట్లు వెల్లడించారు. అలాగే రూ.100 కోట్ల వ్యయంతో 10 వేల అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి చేపట్టామని, రూ.72 కోట్లతో కార్యకర్తలకు 5జీ స్మార్ట్ఫోన్లు అందించి సేవలను డిజిటలైజ్ చేశామని చెప్పారు. మహిళల భద్రత కోసం రాష్ట్రంలోని 26 జిల్లాల్లో వన్ స్టాప్ సెంటర్లు ఏర్పాటు చేసి అత్యవసర సహాయం, న్యాయ సలహాలు, వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనలో భాగంగా గత రెండేళ్లలో 3,393 బాల్య వివాహాలను అడ్డుకున్నామని వెల్లడించారు. మాతా-శిశు ఆరోగ్య పరిరక్షణ కోసం మొదటి ప్రసవానికి రూ.5 వేలు, రెండో ప్రసవానికి రూ.6 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు.

# కేడర్ లో నిర్లేపం, నిక్షిప్తత

**విజయవాడ,, జూన్ 15, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తవుతుంది. తాము సూపర్ సిక్స్ హామీలను అమలు చేశామని చంద్రబాబు, లోకేశ్ లు చెప్పుకుంటున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం హామీల అమలు మాత్రం సక్రమంగా జరగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తమకు మరో పదిహేనేళ్లు తిరుగులేదంటూ జబ్బలు చరుచుకుంటున్నా జగన్ ను విమర్శించడమే పనిగా పెట్టుకుంది. నియోజకవర్గాల్లో ఏం జరుగుతుందన్నది మాత్రం నాయకత్వం పట్టించుకోవడం లేదు. టీడీపీ నాయకత్వం గతంలో మాదిరిగా ఎమ్మెల్యేల పనితీరును మదింపు చేయడం లేదు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చే నివేదికలపైనే ఆధారపడి ఆల్ ఈజ్ వెల్ అని ఫీలవుతుంది.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెట్టుబడులు పెరిగాయి. పరిశ్రమలు వస్తున్నాయి. అందులో ఎవరూ కాదనలేరు. కానీ ఎవరూ అభివృద్ధిని చూసే ఓటేయరు. సంక్షేమం అందరికీ అందడం లేదు. నిధుల కొరత కారణంగా, అధికారులు కొర్రీలు పెడుతూ చాలామందికి కోతలు పెట్టారు. హామీలు అన్ని అమలు పర్చామంటూ డప్పాలు కొట్టుకుంటే సరిపోదు. జనం ఏమనుకుంటున్నారో తెలుసుకుంటే చాలు జరుగుతున్న తప్పులు సరిదిద్దుకునే ప్రయత్నం చేయవచ్చు. ఎమ్మెల్యేల సమావేశం పెట్టినా, కార్యకర్తలతో మీటింగ్ లు పెట్టినా చెప్పడమే తప్ప వినడం తక్కువ కావడంతో వారి నుంచి ఫీడ్ బ్యాంక్ తీసుకోకపోవడమే ప్రధాన సమస్య. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే తమ సమస్యలన్నీ తీరతాయి భావించిన కార్యకర్తలకు నిరాశ ఎదురవుతుంది.మరొకవైపు కాలరెత్తుకుని కార్యకర్తలు తిరగొచ్చని, సూపర్ సిక్స్ హామీలను అమలు చేశామని ప్రజలకు చెప్పమని చంద్రబాబు అంటున్నా సగటు తెలుగుదేశం కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు. నిన్నా మొన్నా వైసీపీ నుంచి వచ్చి చేరిన వారికి లభించే గౌరవం కూడా తమకు దక్కడం లేదంటూ నిట్టూరుస్తూన్నారు. ఆవేదనకు రెండేళ్లు, అసంతృప్తికి రెండేళ్లు, అంటూ తమలో నివురుగప్పిన నిప్పులా దాగున్న బాధను పంటికింద భరిస్తూ, లేని ఆనందాన్ని ముఖంలో నింపుకుంటూ ప్రజల్లోకి వెళ్లేదేలా? అని మనసులోనే కుమిలి పోతున్నారు. కక్కలేక మింగలేక మౌనం పాటిస్తున్నారు. ఇప్పటికైనా తెలుగుదేశం నాయకత్వం మేల్కొని క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులను గమనించాలని కోరుతున్నారు. తమ కష్టాన్ని గుర్తించాలని కార్యకర్తలు వేడుకుంటున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## దువ్వాడ దారెటు...

**విజయనగరం , జూన్ 15, పెన్ పవర్:** రీల్స్ "రాజా" పరిస్థితి దారుణంగా మారిపోయింది. పుట్టింటి వాళ్ళు వదిలేశారు. నమ్ముకున్న పార్టీ తరిమేసింది.. అన్నట్టుగా ఆయన పరిస్థితి మారిపోయింది. తాడేపల్లి నుంచి క్లియర్ మెసేజ్ వచ్చింది. రీ ఎంట్రీ లేదని అన్ని మూసుకొని కూర్చోవాలని.. పార్టీ అధిష్టానం చెప్పేసింది. ఇప్పుడు ఏం చేయాలి.. చీరలు అమ్ముకుంటూ.. రీల్స్ చేసుకుంటూ బతకాలి.. ఇది ఆ సిట్టింగ్ ఎమ్మెల్సీ పరిస్థితి.ఉత్తరాంధ్రలో దువ్వాడ శ్రీనివాస్ కు ఒకప్పుడు భారీగానే ఫాలోయింగ్ ఉండేది. ఫ్యాన్ పార్టీలో ఆయన ఎమ్మెల్సీ కూడా. ఆయన జీవితంలోకి మాధురి రావడంతో పరిస్థితి మారిపోయింది. రాజకీయంలో హత్యలు ఉండవు ఆత్మహత్యలు మాత్రమే ఉంటాయి అనే సామెత అతని ద్వారా మరోసారి నిరూపితమైంది. భార్యను.. ఇద్దరి పిల్లల్ని వదిలిపెట్టి ఆయన తన దారితను చూసుకున్నాడు. వృద్ధాప్యంలో యవ్వనం లాగా.. పడుచు కుర్రాడి లాగా రెచ్చిపోతున్నాడు. మాధురితో రీల్స్ చేయడం.. టీవీ చానల్స్ లలో ముద్దులు పెట్టడం.. ఇలా రకరకాల హంగామా చేస్తున్నాడు.దీనివల్ల 2024 లో పార్టీకి చాలావరకు డ్యామేజ్ జరిగింది. టెక్కలి నియోజకవర్గం లోనే కాకుండా.. ఉత్తరాంధ్ర మొత్తంలో పార్టీకి పెద్ద దెబ్బ పడిపోయింది. ఈ నేపథ్యంలో ఇటీవల ఆయన అసెంబ్లీలో జగన్మోహన్ రెడ్డిని కలిశారు. అప్పటికప్పుడు జగన్మోహన్ రెడ్డి ఏమి చెప్పకపోయినప్పటికీ.. వచ్చి కలువు అన్నారు. అయితే ఇంతవరకు అపాయింట్మెంట్ దొరకలేదు. చివరికి తాడేపల్లి ప్యాలస్ నుంచి క్లియర్ మెసేజ్ వచ్చేసింది. రీ ఎంట్రీ లేదని స్పష్టంగా వర్తమానం అందింది.వైసీపీలోకి మళ్ళీ వెళ్లడానికంటే ముందు శ్రీనివాస్ బిజెపి.. టిడిపి.. జనసేన నాయకులతో మంతనాలు జరిపారు. పార్టీలో చేర్చుకోవాలని వర్తమానం పంపించారు. ఏ పార్టీ నుంచి కూడా సరైన స్థాయిలో స్పందన రాలేదు. మరోవైపు తాడేపల్లి ప్యాలెస్ గేటు కాదు కదా కనీసం ప్రహరీ గోడ కూడా టచ్ చేయడానికి అవకాశం లేదని వర్తమానం అందడంతో శ్రీనివాస్ అంతర్మదనంలో ఉన్నారు. ఆయన సన్నిహితురాలు ప్రస్తుతం హైదరాబాదులో చీరల వ్యాపారం చేస్తున్నారు. ఆయన కూడా అక్కడే ఉంటున్నారు. అప్పుడప్పుడు ఉత్తరాంధ్రకు వెళ్లి పలు కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. అన్ని పార్టీలు డోర్లు క్లోజ్ చేయడంతో.. శ్రీనివాస్ ఏం చేస్తారు.. ఇండిపెండెంట్గా రంగంలోకి దిగుతారా.. లేక రీల్స్ చేసుకుంటూ.. సోషల్ మీడియా ఛానల్స్ కు ఇంటర్వ్యూలు ఇచ్చుకుంటూ వెళ్తారా అనేది చూడాల్సి ఉంది..

## వీడని జ్ఞానేశ్వరి అదృశ్యం మిస్టరీ..

## రంగంలోకి పవన్!

**కాకినాడ, జూన్ 15, పెన్ పవర్:** కాకినాడ జిల్లా తుని మండలంలో చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. : చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం ఘటన మిస్టరీ ఇంకా వీడడం లేదు. ఆ చిన్నారి అదృశ్యమై ఎనిమిది రోజులు గడుస్తోంది. వందలాది మంది పోలీసులు జల్లెడ పడుతున్నారు. కానీ ఇంతవరకు ఆచూకీ లేదు. ఈ నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. ఈ ఘటనపై ఆరా తీసారు. కాకినాడ ఎస్పీతో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కనుకునేందుకు మరిన్ని బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు. గాలింపు చర్యల్లో పోలీస్, ఎస్డిఆర్ఎఫ్ బృందాలతో పాటు ఎన్టీఆర్ బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు. దట్టమైన అడవుల్లో సైతం వెళ్ళగలిగే అటవీ శాఖ నైట్ వాచర్స్, బేస్ క్యాంపు వాచర్స్, నిపుణుల సహాయం తీసుకోవాలని సూచించారు. పరిసర అటవీ ప్రాంతాల్లో జల్లెడ పట్టాలని కూడా ఆదేశాలు జారీ చేశారు పవన్ కళ్యాణ్.కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పోలీసులు పలుమార్లు గాలింపు చర్యలు చేపట్టినా చిన్నారి ఆచూకీ ఇప్పటివరకు లభించలేదు. చిన్నారి కనిపించకుండా పోయినప్పటి నుంచి ఆమె కోసం అన్ని దిశల్లో అన్వేషణ కొనసాగుతోంది. పాప సురక్షితంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొనగా, చిన్నారి కోసం ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్ కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న అధికారులు గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన హనుమాన్ టీం రంగంలోకి దిగింది. నిన్న అర్ధరాత్రి నుంచే అటవీ ప్రాంతాల్లో సెర్చింగ్ ఆపరేషన్ ప్రారంభించిన బృందాలు అడవిలోని ప్రతి ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయి. చిన్నారి జాడ కోసం పోలీసులు, అటవీశాఖ సిబ్బంది, ప్రత్యేక బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ రెండు థర్మల్ డ్రోన్లను రంగంలోకి దించారు. రాత్రి సమయంలో కూడా స్పష్టమైన సమాచారాన్ని సేకరించేందుకు ఈ డ్రోన్లు సహాయపడుతున్నాయి. డ్రోన్ కెమెరాల ద్వారా అడవిలోని పొదలు, లోయలు, చేరుకోవడం కష్టమైన ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. అటవీశాఖ అధికారులు, హనుమాన్ టీం సభ్యులు కలిసి విస్తృత స్థాయిలో గాలింపు కొనసాగిస్తున్నారు. చిన్నారి ఎక్కడైనా చిక్కుకుని ఉండొచ్చనే అనుమానంతో ప్రతి ప్రాంతాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు.అటవీశాఖ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం, ఆ ప్రాంతంలో మనుషులపై దాడి చేసే క్రూర జంతువులు ఉండే అవకాశం చాలా తక్కువగా ఉందని చెబుతున్నారు. దీంతో చిన్నారి క్షేమంగా ఉండే అవకాశాలపై ఆశాభావం వ్యక్తమవుతోంది. అయినప్పటికీ ఎలాంటి అవకాశాన్ని వదిలిపెట్టకుండా అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం కొనసాగుతున్న ఈ సెర్చ్ ఆపరేషన్పై స్థానిక ప్రజలు, కుటుంబ సభ్యులు ఆశగా ఎదురుచూస్తున్నారు. త్వరలోనే పాప జాడ లభించాలని అందరూ ప్రార్థిస్తున్నారు.

**పోలీస్ శాఖ ఉక్కిరిబిక్కిరి..**

చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. 8 రోజులు దాటుతున్న ఆచూకీ దొరకకపోవడంతో పోలీస్ శాఖ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దాదాపు 400 మంది పోలీస్ సిబ్బంది గాలింపు చర్యలు పాల్గొంటున్నారు. అత్యాధునిక డ్రోన్లను సైతం వినియోగిస్తున్నారు. చిన్నారితో పాటు కనిపించకుండా పోయిన కుక్క ప్రత్యక్షం కావడంతో.. దానికి జిపిఆర్ఎస్ కట్టి అడవుల్లో వదిలారు.. అయినా సరే ఎటువంటి ఫలితం లేకపోయింది. అయినా సరే ప్రయత్నాల్లో ఉంది పోలీస్ శాఖ. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పోలీసు ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమీక్షలు జరిపారు. కాకినాడ ఎస్పీకి నేరుగా ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకున్నట్లు తెలుస్తోంది.

అయితే పోలీస్ శాఖ గత ఎనిమిది రోజులుగా చేపట్టిన దర్యాప్తును వివరించారు కాకినాడ జిల్లా ఎస్పీ. చిన్నారి ఇంటి పరిసరాల్లో 38 సీసీ కెమెరాల్లో ఫుటేజీని పరిశీలించామని ఎస్పీ వివరించారు. కాగా జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ కేసులో కీలకంగా మారిన పెంపుడు కుక్క ఊహించని రీతిలో చనిపోయింది. గత రెండు రోజులుగా విచిత్రంగా ప్రవర్తించిన ఆ కుక్క.. చివరకు శనివారం చనిపోయింది. చిన్నారితో పాటుగానే ఈ కుక్క కనిపించకుండా పోయింది. నాలుగు రోజుల కిందట తిరిగి వచ్చింది. చిన్నారి ఇంటి వద్దకు చూసి కంగారుతో అడవిలోకి పారిపోయింది. అతి కష్టం మీద ఆ కుక్కను బంధించారు. ఆ కుక్కకు జిపిఎస్ ట్రాకర్ అమర్చి చిన్నారి జాడ తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఆ ప్రయత్నం విఫలం కాగా.. శనివారం కుక్క సైతం చనిపోవడంతో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

# పాపం షర్మిళ... ఏటీ చేద్దాం

**కడప, జూన్ 15 పెన్ పవర్:** వైయస్ షర్మిల తీవ్ర ఆగ్రహంతో ఉన్నారా? కాంగ్రెస్ పార్టీ తీరుపై ఆవేదనతో ఉన్నారా? తీవ్ర నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నారా? తనకు రాజ్యసభ పదవి ఇవ్వకపోవడంపై కొందరి హస్తం ఉందన్న అనుమానాలు ఆమెలో ఉన్నాయా? అందుకే ఇండియా కూటమి సమావేశానికి ఆమె గైర్హాజరయ్యారా? ఏపీ పొలిటికల్ సర్కిల్లో దీనిపైనే చర్చ నడుస్తోంది. కొద్ది రోజుల కిందట కర్ణాటక నుంచి రాజ్యసభకు షర్మిలను ఎంపిక చేస్తారన్న ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఆమెను ఢిల్లీ పిలిచి కాంగ్రెస్ అగ్ర నేతలు అభయం కూడా ఇచ్చారట. కానీ ఇంతలోనే సమీకరణలు మారిపోయాయి. చివరి నిమిషంలో షర్మిల పేరు లేకుండా పోయింది. అయితే కాంగ్రెస్ పార్టీ కోసం తాను నిలబడితే.. పార్టీ మాత్రం ఇచ్చిన మాట కట్టుబడి ఉండలేదన్న ఆవేదన షర్మిల లో ఉన్నట్లు తెలుస్తోంది. ఆ బాధతోనే రెండు రోజుల కిందట ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి సమావేశానికి ఆమె గైర్హాజరైనట్లు తెలుస్తోంది.2024 ఎన్నికలకు ముందు ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు తీసుకున్నారు షర్మిల. తెలంగాణలో తన తండ్రి పేరుతో పార్టీ ఏర్పాటు చేశారు. కానీ వర్కౌట్ కాకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశారు తన పార్టీని. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఏదో ఒక నియోజకవర్గంలో నుంచి పోటీ చేయాలని భావించారు. అయితే ఏపీలో పార్టీ బాధ్యతలు తీసుకుంటే రాజ్యసభకు అవకాశం ఇస్తామని.. అది కూడా కర్ణాటక నుంచి




ఛాన్స్ కల్పిస్తామని అప్పట్లో అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ హామీ ఇచ్చారు. అప్పటినుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆమె కృషి చేస్తూ వచ్చారు. కర్ణాటక నుంచి రాజ్యసభ పదవులు ఖాళీ అయ్యాయి. అక్కడినుంచి ఛాన్స్ దక్కుతుందని భావించారు షర్మిల. అందుకు తగ్గట్టుగానే ఢిల్లీ నుంచి సమాచారం రావడంతో వెళ్లి వచ్చారు. నామినేషన్ వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ చివరి నిమిషంలో కాంగ్రెస్ హై కమాండ్ హ్యాండిచ్చింది. అయితే ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల ద్వారానే.. తనకు రాజ్యసభ పదవి రాకుండా కుట్ర జరిగిందన్నది షర్మిల లో ఉన్న అనుమానం.ప్రధానంగా కర్ణాటక కాంగ్రెస్ నేతలతో వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డికి మంచి సంబంధాలు ఉన్నాయి. అందుకే ఆయన బెంగుళూరులో తన రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు అన్న ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు అదే కర్ణాటక కాంగ్రెస్ నేతలతో కలిసి జగన్మోహన్ రెడ్డి తనకు రాజ్యసభ పదవి రాకుండా అడ్డుకున్నారన్న అనుమానం షర్మిల లో ఉంది. ఇదే విషయాన్ని పరోక్షంగా ఇటీవల ఆమె ఒక ట్వీట్ చేసినట్లు తెలుస్తోంది. పైగా జగన్మోహన్ రెడ్డిని మచ్చిక చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి అన్న అనుమానాలు కాంగ్రెస్ హై కమాండ్ పై ఉన్నాయి. ఈ అనుమానాలతోనే ఆమె కాంగ్రెస్ హై కమాండ్ పై రగిలిపోతున్నారు. అందుకే కీలకమైన ఇండియా కూటమికి గైర్హాజరయ్యారు. ఇదే పరిణామాలు కొనసాగితే షర్మిల తీవ్ర నిర్ణయం దిశగా అడుగులు వేసే అవకాశం ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# మాజీ ఐపీఎస్ వర్సెస్ మాజీ ఎంపీ... రసకందాయంలో రాజకీయం

**రాజమండ్రి, జూన్ 15 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ కేడర్కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్పై మాజీ ఎంపీ హర్ష కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. ఆర్ఎస్ఎస్ సమావేశానికి ఒక్క పీవీ సునీల్ కుమార్కు మాత్రమే ఎందుకు ఆహ్వానం వచ్చిందని ఆయన ప్రశ్నించారు. అందువల్లే ఆయన్ను ప్రభుత్వం అరెస్ట్ చేయలేక పోతుందేమోనని, ఆయన ఎక్కడ మీటింగ్ పెట్టినా ప్రభుత్వం అనుమతులు ఇస్తుందని అనుమానాలు వ్యక్తం చేశారు.గతంలో ఆర్ఎస్ఎస్ సమావేశానికి హాజరై.. అక్కడ తాను గ్రహించిన విషయాలను ఫిబ్రవరి 10న పీవీ సునీల్ కుమార్ ఫేస్ బుక్లో పోస్టు చేశారు. ఆ పోస్టు స్క్రీన్ షాట్ను సోషల్ మీడియాలో పోస్టు చేసిన హర్ష కుమార్.. ఆయన ఆర్ఎస్ఎస్ అని అర్థమైపోతుందన్నారు. అనంతరం ఫేస్ బుక్లో వీడియో పోస్టు చేసిన హర్ష కుమార్.. ముందు జాగ్రత్తగా జాతిని హెచ్చరిస్తూ తాను ఈ పోస్టు చేశానన్నారు."పీవీ సునీల్ నాకు బాగా తెలిసినాయనే. నేను ఎంపీగా ఉన్నప్పుడు ఆయన ఒకసారి నా దగ్గరికి వచ్చారు. గుంటూరు ఐజీ ఖాళీగా ఉందని, వేయించమని కోరారు. నేను సీఎంతో మాట్లాడి వేయించాను. వేయించలేదని బైబిల్ పట్టుకొని ప్రమాణం చేయమని సునీల్ కుమార్ను చెప్పమనండి. తర్వాత మా మధ్య సంబంధాలు లేవు. రఘురామకృష్ణను కొట్టినప్పుడు.. అది తప్పు కాబట్టి నేను రఘురామ వైపు మాట్లాడి .. సునీల్ కుమార్ తీరును తప్పుబట్టాను. పీవీ సునీల్ కుమార్ ఆర్ఎస్ఎస్ గురించి చేసిన పోస్టును ఎవరో నాకు పంపించారు. బౌద్ధ ఆచారాల ప్రకారం సునీల్ కుమార్ తండ్రి అంత్యక్రియలు నిర్వహించారని నాతో ఒకరు చెప్పారు. దీంతో చింతలపూడిలో నాకు తెలిసిన వాళ్లకు ఫోన్ చేసి అడిగితే.. బౌద్ధ సంప్రదాయం ప్రకారం సునీల్ తండ్రి అంత్యక్రియలు చేసిన మాట నిజమేనని చెప్పారు. ఆర్ఎస్ఎస్ ఇతణ్ని ప్రమోట్ చేస్తుందనే అనుమానం వచ్చేలా నాకు చాలా పోకడలు కనిపించాయి. అందుకే జాతిని ముందే మేల్కొలపాలనే ఉద్దేశంతోనే ఈ పోస్టు పెట్టాను. సునీల్ కుమార్ తన భార్యను హింసించడంతో ఆమె కేసు పెట్టింది. ఆయనపై ఆర్ఆర్ఆర్వి కాకుండా చాలా కేసులు ఉన్నాయి' అని హర్ష కుమార్ వ్యాఖ్యానించారు.మాజీ ఎంపీ హర్ష కుమార్ చేసిన పోస్టు పట్ల సునీల్ కుమార్ పరోక్షంగా స్పందించారు. 'పైకి ట్రిపుల్ ఆర్ (రఘురామ కృష్ణరాజు)తో పోరాడుతున్నట్లు నటిస్తూ.. అతని ఏజెంట్లుగా పని చేస్తున్నవాళ్లు దొరికిపోతున్నారు. వీళ్లను ఏం చేయాలో జాతికి తెలుసు' అని సునీల్ కుమార్ ఫేస్బుక్లో పోస్టు చేశారు.ఈ పోస్టు కింద సునీల్ కుమార్ అభిమానులు చేస్తున్న కామెంట్స్ను బట్టి ఆయన చేసిన ఈ పోస్టు హర్ష కుమార్ను ఉద్దేశించేదనని అర్థమవుతోంది. 'కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రణబ్ ముఖర్జీ లాంటి పెద్ద పెద్ద లీడర్లు సైతం ఆర్ఎస్ఎస్ ఆహ్వానం మేరకు ఆర్ఎస్ఎస్ సభలకు హాజరయ్యారని.. అంత మాత్రాన ప్రణబ్ ముఖర్జీ బీజేపీ మనిషి అయ్యారా? అప్పుడు హర్ష కుమార్ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. వారిని విమర్శించలేని హర్ష కుమార్ గత చరిత్ర మరచి పీవీ సునీల్ గారి మీద బురద జల్లుతున్నారు. హర్ష కుమార్, ఆయన కుమారుడి రాజకీయ పీఠాలు కదులుతాయని భయమా? లేదా ఆర్ఆర్ఆర్కు కోవర్టులుగా పని చేస్తున్నారా?' అని ప్రభుదాస్ అనే వ్యక్తి పీవీ సునీల్ కుమార్ పోస్టు కింద కామెంట్ చేశారు.పీవీ సునీల్ కుమార్ ఇటీవల భీమవరం సభలో మాట్లాడుతూ.. చర్చికి వెళ్లినంత మాత్రాన, ఇంట్లో బైబిల్ ఉన్నంత మాత్రం క్రిస్టియన్లు కారని.. బాప్టిజం తీసుకున్న వారే క్రైస్తవులు అవుతారని వ్యాఖ్యానించారు. తన తండ్రి అంత్యక్రియలను క్రైస్తవ పద్ధతిలోనే చేశానని.. దమ్ముంటే తన ఎస్సీ సర్టిఫికెట్ రద్దు చేయాలని సవాల్ చేశారు. ఈ మీటింగ్ సక్సెస్ కావడంతో రఘురామ కోవర్టులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారని ఆయన ఫేస్బుక్లో పోస్టు చేశారు.

# సత్తుపల్లి, కొవ్వూరు కొత్త లైన్ తో తగ్గనున్న దూరం

**ఏలూరు, జూన్ 15, పెన్ పవర్:** తెలుగు రాష్ట్రాల మధ్య ప్రతిష్ఠాత్మకమైన సత్తుపల్లి-కొవ్వూరు రైల్వే లైన్ ప్రాజెక్టును త్వరితగతిన పట్టాలెక్కించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా రైల్వే బోర్డును కోరింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల రైల్వే శాఖకు భారీగా ఆదాయం సమకూరుతుందని, వ్యయంతో పోలిస్తే వచ్చే రాబడి 14 శాతానికి పైగానే ఉంటుందని ఏపీ ప్రభుత్వం తాజా నివేదికలో స్పష్టం చేసింది. సాధారణంగా ఏదైనా ప్రాజెక్టుకు ఎఫ్ఐఆర్ఆర్ 10 శాతానికి పైగా ఉంటేనే రైల్వే శాఖ లాభసాటిగా భావిస్తుంది. ఈ ప్రాజెక్టుకు అంతకంటే ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి వాటా ఆశించకుండా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే దీనిని నిర్మించాలని ఏపీ ప్రభుత్వం రైల్వే బోర్డు ముందు ప్రతిపాదించింది.నిజానికి భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) నుంచి కొవ్వూరు వరకు రైల్వే లైన్ ప్రాజెక్టు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మంజూరైంది. అప్పట్లో ఈ ప్రాజెక్టు వ్యయంలో సగం వాటాను రాష్ట్ర ప్రభుత్వం భరించాలని రైల్వే శాఖ షరతు విధించింది. అయితే, రాష్ట్ర విభజన తర్వాత మారిన రాజకీయ, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు నిధులు వెచ్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు రాలేదు. మరోవైపు సింగరేణి కాలరీస్ గనుల నుంచి బొగ్గు రవాణాను సులభతరం చేసేందుకు తెలంగాణ పరిధిలోని భద్రాచలం రోడ్ నుంచి సత్తుపల్లి వరకు ఇప్పటికే రైల్వే లైన్ నిర్మించారు. ఇప్పుడు సత్తుపల్లి నుంచి కొవ్వూరు వరకు మిగిలిన 118.9 కిలోమీటర్ల మేర కొత్త లైన్ నిర్మిస్తే ఈ కీలక అనుసంధానం పూర్తవుతుందని ఏపీ ప్రభుత్వం వివరిస్తోంది. ఈ ప్రతిపాదిత మార్గంలో ఏపీ పరిధి 70.31 కిలోమీటర్లుగా ఉంది.ఈ ప్రాజెక్టుకు అయ్యే ఖర్చులో ఏపీ ప్రభుత్వం సగం నిధులు ఇవ్వాలని లేదా కనీసం భూసేకరణ వ్యయాన్నైనా భరించాలని రైల్వే శాఖ గతంలో పట్టుబట్టింది. అయితే ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఈ ప్రాజెక్టును కేంద్రమే చేపడుతుందని స్పష్టమైన హామీ ఉన్నందున.. రైల్వే శాఖే పూర్తి నిధులు కేటాయించాలని ఏపీ ప్రభుత్వం వాదిస్తోంది. ఈ లైన్ సాకారమైతే కొత్తగూడెం,

మణుగూరు ప్రాంతాల్లోని సింగరేణి గనుల నుంచి సేకరించే బొగ్గును కాకినాడ పోర్టుకు తరలించడానికి రైలు మార్గంలో సుమారు 140 కిలోమీటర్లకు పైగా దూరం తగ్గుతుంది. దీనివల్ల రవాణా ఖర్చులు భారీగా తగ్గడమే కాకుండా... సమయం కూడా ఆదా అవుతుంది. పారిశ్రామికంగా, రవాణా పరంగా ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున భూసేకరణతో పాటు అన్ని రకాల పరిపాలనాపరమైన సహకారం అందిస్తామని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది.

# విరాట్ కోహ్లీ నిజంగానే అహంకారి.. రవి శాస్త్రి కామెంట్స్ వైరల్!



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మైదానంలో అడుగుపెడితే ఎలా ఉంటాడో క్రికెట్ ప్రేమికులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.. ఒక్కసారి గ్రౌండ్‌లోకి దిగిన తర్వాత కోహ్లీ బాడీ లాంగ్వేజ్ పూర్తిగా చేంజ్ అవుతుంది. ప్రత్యర్థి జట్టు కవ్వింపు చర్యలకు దిగితే వారి శైలిలోనే ఆన్సర్ ఇస్తాడు.. స్లెడ్జింగ్‌కు దిగిన వారికి దిమ్మతిరిగేలా కౌంటర్ ఇస్తాడు. అదే సమయంలో అంతే సరదాగానూ ఉండటం కోహ్లీకే చెల్లింది. కానీ, కొంతమంది మాత్రం విరాట్ కోహ్లీని అహంకారి, కోపిష్టి అంటూ విమర్శిస్తూ ఉంటారు. తాజాగా ఇదే తరహాలో కోహ్లీని విమర్శిస్తూ టీమిండియా మాజీ కోచ్ ఓ పోస్టు పెట్టారు.

**నిజంగానే కోహ్లీ అహంకారి:**

విరాట్ కోహ్లీని విమర్శిస్తూ వచ్చిన పోస్టుపై టీమిండియా మాజీ హెడ్‌కోచ్ రవిశాస్త్రి మాట్లాడుతూ.. అహంకారి, అతి గారాబం వల్ల చెడిపోయిన అల్లరిపిల్లాడు.. దూకుడు.. కోహ్లీ గురించి వాళ్లు అన్న ప్రతీ మాటలో నిజం ఉందన్నాడు. కానీ, ఇదంతా క్రికెట్ స్టేడియంలో ఉన్నంత వరకే. గ్రౌండ్ బయట విరాట్ ఇందుకు పూర్తి విభిన్నంగా ఉంటాడని వెల్లడించాడు. ఎక్కడ ఎలా ఉండాలో తెలిసిన వ్యక్తులంటే నాకు చాలా ఇష్టం.. స్టేడియంలో కింగ్ కోహ్లీ చూపించే అగ్రెషన్ క్రీడలో భాగమేనని శాస్త్రి పేర్కొన్నారు.

**కోహ్లీ- రవిశాస్త్రి మధ్య ప్రత్యేక అనుబంధం:**

రవిశాస్త్రి హెడ్‌కోచ్‌గా, కోహ్లీ కెప్టెన్‌గా ఉన్న సమయంలో భారత జట్టు అద్భుతమైన విజయాలు సాధించింది. ముఖ్యంగా టెస్టు ఫార్మాట్‌లో నంబర్ వన్‌గా నిలిచి సత్తా చాటింది. ఆ తర్వాత ఈ ఇద్దరు తమ తమ పదవుల నుంచి తప్పుకున్నప్పటికీ, వారి మధ్య ఉన్న అనుబంధం మాత్రం అలాగే కొనసాగుతోంది. తాజాగా రవిశాస్త్రి చేసిన కామెంట్స్ తో ఈ విషయం మరోసారి రూజువైంది.

**వన్డే సిరీస్‌కు కింగ్ కోహ్లీ దూరం:**

ఇటీవలే ముగిసిన ఐపీఎల్-2026 లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ) విజేతగా నిలవడంలో విరాట్ కోహ్లీ కీలక పాత్ర పోషించాడు. ఫైనల్ మ్యాచ్ సందర్భంగా గాయపడిన కోహ్లీ.. ఆఫ్ఘనిస్తాన్‌తో స్వదేశంలో జరుగుతున్న వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. ప్రస్తుతం అతని స్థానంలో యశస్వి జైస్వాల్ జట్టులోకి వచ్చాడు. మరోవైపు రవిశాస్త్రి ప్రస్తుతం కామెంటేటర్‌గా కొనసాన్నాడు.

# జూన్ 17న ఉదయం మ్యాచ్.. మధ్యాహ్నం మ్యాచ్.. రాత్రికి మరో మ్యాచ్.. భారత క్రికెట్ ఫ్యాన్స్‌కు ఫుల్ మీల్స్!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ అభిమానులకు ఎల్లుండి (జూన్ 17న) పండగలాంటి రోజు అని చెప్పాలి.. ఎందుకంటే ఆ ఒక్క రోజే ఏకంగా మూడు క్రేజీ మ్యాచ్‌లు జరగబోతున్నాయి. ఉదయం నుంచి రాత్రి దాకా టీమిండియాకు సంబంధించిన వేర్వేరు జట్లు మైదానంలోకి దిగుతుండటంతో.. ఏకంగా 12 గంటల పాటు నాన్‌స్టాప్ క్రికెట్ ఎంటర్‌టైన్‌మెంట్ పక్కా అని ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.

**ఇండియా A' vs ఆఫ్ఘనిస్తాన్ 'A':**

ట్రై సిరీస్‌లో భాగంగా ఎల్లుండి ఉదయం 10:00 గంటలకే మొదటి మ్యాచ్ స్టార్ట్ అవుతుంది. ఇండియా 'ూ', ఆఫ్ఘనిస్తాన్ 'ూ' జట్ల మధ్య వన్డే (ాణ×) పోరు జరగబోతుంది. యంగ్ ప్లేయర్స్ తమ సత్తా చాటడానికి ఈ మ్యాచ్ ఎంతో కీలకం కానుంది.

**టీమిండియా VS ఆఫ్ఘనిస్తాన్:**

ఇక మధ్యాహ్నం నుంచి అసలైన హై-వోల్టేజ్ మ్యాచ్ ప్రారంభమైతుంది. మధ్యాహ్నం 1:30 గంటలకు ఆఫ్ఘనిస్తాన్ సీనియర్ జట్టుతో టీమిండియా తన రెండవ వన్డే (2అ ాణ×) మ్యాచ్‌లో తలపడనుంది. సీనియర్ల పోరు కావడంతో ఈ మ్యాచ్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

**భారత మహిళల జట్టు జం నెదర్లాండ్స్:**

పగలు మెన్స్ క్రికెట్ ముగిశాక, రాత్రి సమయంలో ఉమెన్స్ క్రికెట్ ధమాకా షురూ కాబోతుంది. మహిళల టి20 వరల్డ్ కప్ (ం20 ౌజ) లో భాగంగా రాత్రి 7:00 గంటలకు భారత మహిళల జట్టు నెదర్లాండ్స్‌ను ఢీకొట్టనుంది. వరల్డ్ కప్ పోరు కావడంతో మన అమ్మాయిల మ్యాచ్‌ను చూసేందుకు ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

దీంతో బుధవారం నాడు పొద్దున్న 10 గంటల నుంచి రాత్రి దాకా టీవీలు, మొబైల్ స్క్రీన్లకు అతుక్కుపోయేలా మొత్తం 12 గంటల నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్యాకేజ్ రెడీ అయింది. దీంతో ఆ రోజు అన్ని మ్యాచులని చూసేందుకు క్రికెట్ ఫ్యాన్స్ రెడీ అవుతున్నారు. మరీ చూడాలి జూన్ 17న భారత్ జట్టు అన్ని విభాగాల్లో గెలుస్తుందో లేదో అనేది.

# ఐపీఎల్‌లో ఊచకోత.. శ్రీలంకలో చేతులెత్తేసిన వైభవ్.. ఫ్లాట్ పిచ్ కాదురా బాటు అంటూ ట్రోలింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** : ఐపీఎల్ (IPL 2026) లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న 15 ఏళ్ల వండర్ కిడ్ 'ఆరెంజ్ క్యాప్' గెలుచుకుని, క్రిస్ గేల్ పేరిట ఉన్న మోస్ట్ సిక్సర్స్ (72 సిక్సులు) రికార్డును బద్దలు కొట్టిన వైభవ్ సూర్యవంశీ.. ప్రస్తుతం శ్రీలంక వేదికగా జరుగుతున్న వన్డే ట్రై-సిరీస్‌లో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నాడు. టీమిండియా 'A' తరపున ఆడుతున్న ఈ యంగ్ ఓపెనర్.. వరుసగా 3 ఇన్నింగ్స్‌ల్లోనూ తక్కువ స్కోర్లకే అవుట్ కావడంతో సోషల్ మీడియాలో నెటిజన్లు అతడిపై గట్టిగానే ట్రోలింగ్ నడుస్తుంది.

**వన్డేల్లో తడబడిన వైభవ్:**

తిలక్ వర్మ కెప్టెన్సీలోని భారత్ 'ూ' జట్టు ఈరోజు (సోమవారం) రంగిరి దంబుల్లా అంతర్జాతీయ స్టేడియంలో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్‌గా వచ్చిన వైభవ్ సూర్యవంశీ.. చమిక గుణశేఖర వేసిన తొలి ఓవర్లోనే ఒక సిక్స్, రెండు ఫోర్లు బాది ఐపీఎల్ రేంజ్ అటాకింగ్ స్టార్ట్ చేశాడు. కానీ, శ్రీలంక 'ూ' కెప్టెన్, ఆఫ్-స్పిన్నర్ సహన్ అరాచ్చిగే బౌలింగ్‌లోకి రాగానే వైభవ్ తడబడ్డాడు. కేవలం 14 బంతుల్లో 21 పరుగులు (3 ఫోర్లు, 1 సిక్స్) చేసి ఔట్ అయ్యాడు.

**మూడు ఇన్నింగ్స్‌ల్లోనూ ఫ్లాప్ షో:**

ఐపీఎల్‌లో 237.3 స్ట్రైక్ రేట్‌తో రెచ్చిపోయిన వైభవ్ సూర్యవంశీ, ఈ వన్డే సిరీస్‌లో క్రీజులో అస్సలు నిలబడలేకపోతున్నాడు. శ్రీలంక 'ూ'తో జరిగిన మొదటి మ్యాచ్లో 12 బంతుల్లో 14 రన్స్ మాత్రమే చేయగా.. ఇక ఆఫ్ఘనిస్తాన్ 'ూ'తో జరిగిన పోరులో 22 బంతుల్లో 44 రన్స్ తో మంచి స్టార్ట్ వచ్చినప్పటికీ, దాన్ని భారీ స్కోరుగా మార్చుకోలేకపోయాడు. అలాగే మూడో మ్యాచ్ : 14 బంతుల్లో 21 రన్స్ మాత్రమే చేసి తన ఫ్లాప్ షోని కంటిన్యూ చేశాడు.

**సోషల్ మీడియాలో ట్రోల్స్:**

వైభవ్ వరుసగా విఫలం అవుతుండటంతో.. ఈ నెల చివర్లో జరగబోయే ఐర్లాండ్ సిరీస్‌కు, అలాగే జూలైలో ఇంగ్లాండ్ సిరీస్‌కు టీమిండియా మెయిన్ టీమ్‌కు ఎంపికైన అత్యంత పిన్న వయస్కుడైన ఆటగాడిగా రికార్డ్ సృష్టించిన వైభవ్‌ను నెటిజన్లు టార్గెట్ చేస్తున్నారు. బాబోయ్.. ఇది ఐపీఎల్ ఫ్లాట్ పిచ్ కాదురా బాబు.. ఇంటర్నేషనల్ కండిషన్స్‌లో స్పిన్నర్లను ఎలా ఆడాలో నేర్చుకో, పవర్‌ప్లే ముగియకముందే ఔట్ అవ్వడానికి ఇది టీ20 కాదు, వన్డే మ్యాచ్.. కొంచెం నిలకడగా ఆడాలి అంటూ ఎక్స్ (X) లో ట్రోల్ చేస్తున్నారు.

**కోచ్ ఫుల్ సపోర్ట్:**

నెట్టింట ట్రోలింగ్ ఎలా ఉన్నా.. ఇండియా 'A' హెడ్ కోచ్ హృషికేష్ కణిత్కర్ మాత్రం వైభవ్‌కు అండగా నిలిచాడు. వైభవ్ చాలా చిన్న వయస్కుడైనప్పటికీ, తన బ్యాటింగ్, జట్టులో తన రోల్ ఏంటనేది అతనికి బాగా తెలుసు.. ఎవరైనా సలహాలు ఇస్తే వింటాడు, దానిని ప్రాక్టీస్ చేస్తాడు.. అతని బ్యాటింగ్ తీరు నాకు బాగా నచ్చిందంటూ కోచ్ పాజిటివ్‌గా స్పందించాడు.

# రష్మిక మందన్న మొదటి A-రేటెడ్ ఫిలిమ్



మానస చౌదరి సంప్రదాయ శోభ: అరంగేట్రం నుండి వర్ధమాన తారగా...





శ్రేయా ధన్వంతరి యొక్క బోల్డ్ గ్లో: తెలుగు అరంగేట్రం నుండి ఇు స్టార్ వరకు

నేషనల్ క్రష్ రష్మిక మందన్న తన కెరీర్‌లో మొదటిసారి ఒక ఘాటైన రొమాంటిక్ -ఏ- రేటెడ్ సినిమాలో నటించారు. బాలీవుడ్ నటులు షాహిద్ కపూర్, కృతి సనన్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటించిన -కాక్‌టెయిల్ 2- చిత్రానికి సెన్సార్ బోర్డ్ (జదీఖీజ) తాజాగా 'ూ' సర్టిఫికేట్ జారీ చేసింది. సాధారణంగా రష్మిక ఇప్పటివరకు నటించిన సినిమాలన్నీ ఖ లేదా యుఏ సర్టిఫికేట్‌లతోనే వచ్చాయి. గతంలో -యానిమల్- చిత్రానికి -ఏ- సర్టిఫికేట్ వచ్చినా.. అది భారీ రక్తపాతం, వయలెంట్ యాక్షన్ వల్ల వచ్చింది. కానీ ఇప్పుడు రానున్న -కాక్‌టెయిల్ 2- మాత్రం పూర్తిగా ఘాటైన శృంగార సన్నివేశాలు, రొమాంటిక్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో నిండి ఉండటం వల్లే వయోజనులకు మాత్రమే (అడల్ట్స్ ఓన్లీ) అని సెన్సార్ బోర్డు తేల్చేసింది. ఈ శుక్రవారం -జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కాబోతున్న ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ ఇప్పటికే కొన్ని పరిమిత స్క్రీన్లలో ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలోనే ఈ చిత్రానికి -ఏ- సర్టిఫికేట్ లభించిన విషయం వెలుగులోకి వచ్చింది. రష్మికతో పాటు గ్లామరస్ బ్యూటీ కృతి సనన్‌కు కూడా ఇది కెరీర్‌లో మొదటి అడల్ట్ ఫిల్మ్ కావడం గమనార్హం. ఈ చిత్రంలో కృతి సనన్ మునుపెన్నడూ చూడని బోల్డ్ - గ్లామ్ లుక్‌లో కనిపించనున్నారు. -తేరే ఇష్క్ మే- చిత్రంలో ఎంతో ఇంటెన్స్ రోల్ పోషించిన కృతి.. ఇందులో ఇలాంటి పూర్తి బోల్డ్ అవతారంలోకి మారడం చూసి అభిమానులు సైతం షాక్‌కు గురవుతున్నారు. గతంలో 2012లో వచ్చిన -కాక్‌టెయిల్- చిత్రం సైఫ్ అలీ ఖాన్, దీపికా పదుకోన్, దయానా పెంటిల మధ్య నడిచే ముక్కోణపు ప్రేమకథగా వచ్చి బాక్సాఫీస్ వద్ద పెద్ద విజయం సాధించింది. ముఖ్యంగా ఆ సినిమా దీపికా పదుకోన్ కెరీర్‌ను మలుపు తిప్పింది. అయితే ఆ మొదటి భాగం సెకండ్ హాఫ్‌లో కాస్త మెలోడ్రామాగా మారినా... ఈ సరికొత్త సీక్వెల్ మాత్రం మొదటి నుండి చివరి వరకు చాలా కూల్‌గా, హాయిగా సాగిపోతుందని నిర్మాత దినేష్ విజన్ ట్రైలర్ లాంచ్‌లో వెల్లడించారు. అయినా థియేటర్లలో యూత్‌ను ఆకట్టుకునేలా ఇందులో బోల్డ్ సీన్స్ మోతాదు కాస్త గట్టిగానే ఉన్నట్లు తెలుస్తోంది. సినిమా ట్రైలర్ - కథనం చూస్తే.. 2012 నాటి మొదటి భాగం టెంప్లేట్‌నే మేకర్స్ ఫాలో అయినట్లు స్పష్టమవుతోంది. ప్రతి ఫ్రేమ్‌లోనూ విపరీతమైన స్టైల్, అందమైన సముద్ర తీరాలు, హాట్‌నెస్ - సెక్సీనెస్ కవ్విస్తూనే ఉన్నాయి. అయితే ఈ ప్రోమో కేవలం గ్లామర్‌ను నమ్ముకుని కాస్త డొల్లగా ఉందనే విమర్శలు కూడా వస్తున్నాయి. సినిమాలో ఏదైనా బలమైన కంటెంట్ ఉందా లేదా అనేది కేవలం ట్రైలర్ చూసి ఇప్పుడే అంచనా వేయలేం. ఈ సినిమాలో ఒక ఆసక్తికరమైన ట్విస్ట్ ఉందని... ఇది ఒక క్వీర్ -స్వలింగ ప్రేమకథ అనే పుకార్లు కూడా గట్టిగా వినిపిస్తున్నాయి. దీనిపై క్లారిటీ రావాలంటే జూన్ 19 వరకు ఆగాల్సిందే. మొదటి భాగం -కాక్‌టెయిల్- అంతటి భారీ బ్లాక్‌బస్టర్ కావడానికి సంగీత దర్శకుడు ప్రీతమ్ అందించిన అద్భుతమైన పాటలు ఒక ముఖ్య కారణం. కానీ ఈ సీక్వెల్ చిత్రానికి సంబంధించిన ప్రోమో - సౌండ్‌ట్రాక్ మొదటి భాగం అంత ఆకట్టుకునేలా లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా.. షాహిద్ కపూర్‌తో పాటు కృతి సనన్, రష్మిక మందన్నల బోల్డ్ అండ్ రొమాంటిక్ కెమిస్ట్రీ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. మరి ఈ ఘాటైన రొమాంటిక్ ఎంటర్‌టైనర్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో వేచి చూడాలి.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965